ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 8 నవంబరు 2024



రాయచోటిలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు, సిబ్బంది




## క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముందస్తు పరీక్షలు చేయించుకోవడంతో పాటు సకాలంలో చికిత్సలు చేయించుకుంటే క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ వైద్యశాల నుంచి పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7వ తేదీ నుంచి క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో సంవత్సరానికి 40 వేల మంది క్యాన్సర్ బారినపడి చనిపోతున్నారని చెప్పారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా 2023-24 సంవత్సరంలో రూ.680 కోట్లు క్యాన్సర్ వ్యాధి సంరక్షణ కొరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఏడుగురిలో క్యాన్సర్ ఒకరికి ఉండవచ్చునని అంచనా ఉందన్నారు. క్యాన్సర్ నివారణకు ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించి మంచి పౌష్టికాహారం తీసుకుని రోజూ వ్యాయామం, నడక, యోగా పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితం గడపాలని నిపుణులు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్, పీహెచ్‌ఎం యూనిట్ వైద్యులు డాక్టర్ అనితవాణి, డిప్యూటీ డెమో దేవశిరోమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఉషారాణి, బాలికల ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ హైదర్‌అలీ, అధ్యాపకులు విశ్వప్రతాప్, సుగుణ, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాదర్‌బాషా, పర్వీన్, నూర్జహాన్, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# జగనన్నతో.. జనం కడగండ్లు

- ఒకటి ఎత్తయిన గుట్టలో.. మరొకటి వంకలో..
- కురవోనివంకలో కట్టేందుకు జంకుతున్న జనం
- బద్దిపల్లిగుట్టకు నిర్మాణ సామగ్రి చేరవేతకే తడిసి మోపెడవుతున్న వ్యయం
- పట్టా ఉన్నా జాగాలేదు.. జాగా ఉంటే నిర్మాణం లేదు
- నీరు లేదు..రోడ్డు లేదు.. అస్తవ్యస్తంగా హౌసింగ్ పనులు



మౌలిక వసతులు లేక పునాదుల్లోనే ఆగిన నిర్మాణాలు

బి.కొత్తకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బి.కొత్తకోట పట్టణంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో జనం కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ప్రధాన కాలనీలలో ఒకటి గుట్టమీద, మరొకటి వంకలో అది కూడా ఊరికి మూడు కి.మీల దూరంలో కేటాయించారు. నిర్మాణానికి అనువుగా లేక అష్టకష్టాలుపడి కడితే బిల్లులు రాలేదని కొందరు బాధపడుతుంటే, ట్రాక్టరు కూడా వెళ్లలేని ఎత్తయిన గుట్టలో సామగ్రిని మోసి మరీ నిర్మాణాలు ఎలా చేయాలని వాపోతున్న వారు మరికొందరు. నిటారుగా ఉన్న గుట్ట ప్రాంతం... ఎగువకు మనిషి నడవటమే కష్టం...రోడ్డు, నీటి సరఫరా ఎలా? అంటూ బద్దిపల్లి కాలనీ వాసులు బాధపడుతుంటే, పట్టణ శివారు ప్రాంతమైన తాకాటంవారిపల్లె రోడ్డులోని కురవోనికుంటలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో కడితే మునకకు గురవుతామని, పైగా చౌడు భూమి అంటూ పునాదులు వేయడానికే భయపడుతున్నారు. బాధిత లబ్ధిదారుల వెతలు ఒక్కొక్కరివి ఒక్కో రకంగా ఉన్నాయి. పరిష్కరించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని, ఇల్లు వచ్చిందని సంబరపడాలో, అలాంటి చోట ఇచ్చినందుకు బాధపడాలో అర్థం కావడం లేదని బాధితులు వాపోతున్నారు.

### అమ్మో.. కురవోనికుంటలోనా?

పట్టణానికి 3 కి.మీల దూరంలో 550 ప్లాట్లతో కురవోనికుంటలో లేఅవుట్ వేశారు. హడావిడి చేసి స్థలాలు చూపించారు. నీరు, కరెంటు, రోడ్డు సౌకర్యం లేక వివిధ దశలలో నిర్మాణాలు ఆగిపోయాయి. కాలనీ అంతా చౌడు భూమి కావడంతో పునాదుల భద్రతపై అనుమానాలున్నాయి. పైగా అది వంకప్రాంతం కావడంతో కాలనీలోకి నీరు చేరుతుందనే భయం, అటవీ ప్రాంతం కావడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ సాహసం చేస్తే ట్యాంకర్లతో నీటిని తోలుకోవాల్సిందే. ట్యాంకర్ పోలేని చోట్లకు మోసుకోవాల్సిందే. విద్యుత్ సౌకర్యం కూడా అంతంతమాత్రమే. కరెంట్ స్తంభాలు నాటినప్పటికీ, కాలనీలో కొంత భాగానికి మాత్రమే కనెక్షన్ ఇచ్చారు. మట్టి రోడ్ల నిర్మాణం కూడా లేకపోవడంతో నిర్మాణ సామాగ్రి తరలించడం కష్టసాధ్యంగా మారింది. దీంతో వందలాది ప్లాట్లు పునాదులకే పరిమితమయ్యాయి. పునాది కూడా పడని స్థలాలూ దర్శనమిస్తున్నాయి.

### సామగ్రి తరలించాలంటే ఖర్చు రెట్టింపు

బడికాయలపల్లె రోడ్డులోని బద్దిపల్లిగుట్ట 1, 2 కాలనీలలో 400కుపైగా ఇళ్లను కేటాయించారు. గుట్టకు నిటారుగా మెట్ట ప్రాంతంలో ఇంటి స్థలం వచ్చినవారి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సామాగ్రితో పాటు నీటిని సైతం మోసుకెళ్లాల్సి రావడంతో నరకం చూస్తున్నారు. ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఓపిక, తాహతు ఉన్నవారు అన్ని కష్టాలు పడి ఇంటి నిర్మాణం చేసినా బిల్లుల చెల్లింపులో జాప్యం, నివాసం రావడానికి మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది.. ఇంకా నిర్మాణాలు చేయనివారు ఎగువ ప్రాంతానికి ట్రాక్టర్ వెళ్లలేదు కాబట్టి వంద, యాభై మీటర్ల దూరంలో దింపిన ఇసుక, ఇటుకలు, రాళ్లను అక్కడి నుంచి నెత్తిన మోసుకుని ఇళ్లు కడుతున్న చోటికి తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తమ గోడు ఎవరికి చెప్పుకున్నా ఫలితం లేదని బాధితులు వాపోతున్నారు. భూమికి సుమారు 200 అడుగుల ఎత్తులో నిర్మాణం ఎలా? వసతులు ఎలా? తర్వాత కాపురాలు ఎలా? అన్నది అధికారులకే తెలియాలి

### పట్టాలు చేతిలో ఉన్నా స్థలం చూపలేదు

బద్దిపల్లెగుట్ట, కురవోనికుంట, బెంగళూరు రోడ్డులోని జగనన్న కాలనీల కోసం అంటూ అప్పటి వైసీపీ పాలకులు గంపగుత్తగా పట్టాలు పంపిణీ చేసేశారు. అయితే వీరిలో కొందరు తమ చేతిలో పట్టా ఉంది కానీ ఆ స్థలం ఎక్కడ ఉందో తెలియదు. హౌసింగ్ వాళ్లను అడిగితే రెవెన్యూ వాళ్లు చూపించాలి అంటారు. వీఆర్వోలను అడిగితే సర్వేయర్ చూపాలి అంటారు. సర్వేయరును అడిగితే పై అధికారులు చెప్పాలి. లేఅవుట్‌కు అనుమతులు కావాలి అంటారు. తాము ఈ పట్టా కాగితాన్ని పెట్టుకుని ఏమి చేసుకోవాలని బాధితులు బాధపడుతున్నారు. బి.కొత్తకోట జగనన్న కాలనీలో ఇల్లు మంజూరై సంతృప్తి కరంగా ఉన్న లబ్ధిదారులు సగం కూడా లేరంటే అతిశయోక్తి కాదు. ఖాళీ పట్టా కాగితాలు ఇళ్లలో పెట్టుకున్న వారు వందల్లో ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

**ఈ రెండు కాలనీలలో తాజా పరిస్థితి..**

| | |
|---|---|
| మొత్తం ప్లాట్లు | 857 |
| హౌసింగ్ అనుమతులున్నవి | 780 |
| పునాది దశలో ఆగినవి | 193 |
| బేస్మెంట్‌వరకు నిర్మాణం జరిగినవి | 305 |
| లెంటల్ లెవెల్‌లో వున్నవి | 31 |
| గోడలు వరకు పూర్తయినవి | 78 |
| మోల్డింగ్ పూర్తయినవి | 11 |
| నిర్మాణం పూర్తయినవి | 165 |

### అధికారుల నిలదీత

డిసెంబరులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ, డీఈ సహా మండల అధికారులు ఇటీవల జగనన్న కాలనీలలో నిర్వహించిన మన ఇల్లు-మనగౌరవం కార్యక్రమంలో లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. రోడ్డులేకుండా సామాగ్రి ఎలా చేర్చాలి. నీరు కూడా కొనుక్కుని ఇల్లు ఎలా కట్టాలి, బిల్లులు రాకుంటే ఏం చేసేది, ఈ ఖాళీ పట్టా మేము ఏం చేసుకోవాలి అంటూ వాదనకు దిగారు. అన్నీ సరిపోయేలా చూస్తామని చెప్పి వెళ్లిన అధికారులు ఇప్పటికీ అతీగతీ లేదని బాధితులు వాపోతున్నారు.

### సదుపాయాలు ఆయా శాఖలు చూడాలి..

జగనన్న కాలనీలలో రోడ్డు, నీరు, విద్యుత్ లాంటి సౌకర్యాలు ఆయా శాఖల అధికారులు చూడాలి. ఇంటి పట్టా ఇచ్చి జాగా చూపాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులది. గృహ నిర్మాణం, వాటి బిల్లుల వరకే మేము చూడగలం. పెండింగ్ బిల్లులు త్వరలో వారి ఖాతాలకు జమ అవుతాయి. నిర్మాణాలు చేయండని ఎంత చెప్పినా కొందరిలో చలనం లేదు. మా సిబ్బంది అదే పనిమీద ఉన్నారు. నిధుల కొరత కూడా కారణం కావచ్చు.

- సరోజీబాష హౌసింగ్ ఏఈ, బి.కొత్తకోట అర్బన్



మౌలిక వసతులు లేక పునాదుల్లోనే ఆగిన నిర్మాణాలు



కాలనీలో ట్రాక్టర్లు వెళ్లడానికి వీలులేని మెట్ట ప్రాంతం



ఏటవాలు గుట్టపై కష్టపడి పునాదులు వేసుకున్న లబ్ధిదారులు

మదనపల్లె మున్సిపల్ కార్యాలయంలో కరెక్షన్‌కు క్యూకట్టిన జనాలు



## సర్టిఫికెట్ కరెక్షన్‌కు డబ్బుల వసూళ్లు

- ఒక్క పనికి రూ.350 నుంచి రూ.750
- రద్దీని ఆసరాగా చేసుకుని డిమాండ్
- మున్సిపల్, సచివాలయాల్లో ఇదే పరిస్థితి

6

## గురిపెడితే పతకమే..



- మెరిసిన ప్రొద్దుటూరు ఆణిముత్యం
- రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్న మహ్మద్ ఉబైద్

6

# మూడో రోజూ తనిఖీలు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న సీఐడీ విచారణ

రాయచోటి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జూలై 21న జరిగిన ఫైల్స్ దహనం కేసులో సీఐడీ పోలీసులు విచారణ, తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండుసార్లు మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించగా, తాజాగా మూడో విడతగా మూడో రోజు గురువారం వివిధ రికార్డులపై ఆరా తీశారు. వైసీపీ నేతల ఇళ్లల్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సరిపోల్చుకున్నారు. తమ దగ్గర ఉన్న జిరాక్స్ పత్రాలపై తర్వాత ఏమైనా లావాదేవీలు జరిగాయా అని ఆరా తీశారు. ముఖ్యంగా బీకే పల్లె సర్వే నెంబరు-527లోని 4 నాలుగు ఎకరాల విస్తీర్ణంపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరి నుంచి ముగ్గురు పేర్ల మీదకు మారిన ఈ డాక్యుమెంట్, డీకేటీకి సంబంధించిందని, అయితే దీనిని ఎలా రిజిస్టర్ చేశారని ప్రశ్నించారు. 2016 సంవత్సరానికి ముందు చాలా డీకేటీ భూములు రిజిస్టర్ అయ్యాయని, ఆ తర్వాత 22ఏలో పెట్టినట్లు సమాధానం చెప్పారు. ఈ భూమి ప్రస్తుతం శ్రీరామ రామాంజనేయులు పేరుతోనే పెట్టినట్లు సమాధానం చెప్పారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేటు ట్రస్ట్ భూములపై ఆరా తీశారు. 1952 కంటే ముందు రిజిస్టర్ భాగపరిష్కారమైన ఈ భూములపై ఉన్న సందేహాలను సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకున్నారు.

అలాగే వివిధ రికార్డులు, డాక్యుమెంట్లకు సంబంధించి ఆర్‌హెచ్ పేజీని పరిశీలించారు. ఆర్‌హెచ్ పేజీలో ఏయే వివరాలు వస్తాయో? కార్యాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్డేజ్ పీజీ ఎప్పటి నుంచి అమల్లో ఉంది..? అందులో నమోదయ్యే వివరాలపై తమ వద్ద డాక్యుమెంట్ల హిస్టరీని సరి చూసుకున్నట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం నెల్లూరుకు చెందిన ఎస్ఐ స్థాయి అధికారి మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు తమకు కావాల్సిన సమాచారాన్ని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి, రికార్డ్ అసిస్టెంట్ నుంచి సేకరించి నమోదు చేసుకున్నారు. అలాగే ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన భూములు, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీసోడియాకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు, డాక్యుమెంట్లపై కూడా ఆరా తీశారు ఇలా తిరుపతి, నెల్లూరుకు చెందిన సీఐడీ అధికారులు కొన్ని రోజులుగా మదనపల్లెలో మకాం వేసి విచారణ చేపడుతున్నారు.

# నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

కురబలకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వావి, వరసలు మరిచి సొంత అమ్మమ్మపైనే అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన నిందితుడికి యా వజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ చిత్తూరు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎన్.శాంతి గురువారం తీర్పు ఇచ్చినట్లు రూరల్ సీఐ రమేశ్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ సద్దికూటివారిపల్లెకు చెందిన ఈశ్వరమ్మ కుమారుడు ఇంద్రప్రసాద్ మద్యానికి బానిసై సైకోలా ప్రవర్తించేవాడు. కాగా ఇతని వైఖరికి విసుగు చెంది భార్య అతడిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. కాగా 6.4.2018న నిందితుడి తల్లి అమ్మ కృష్ణమ్మ (90)ను చూసుకోమని అతడికి చెప్పి పొలం వద్దకు వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న అతను తన సొంత అమ్మమ్మ పైనే అత్యాచారం చేసి హత్య చేశాడు. నిందితుడి తల్లి ఇంటికి రాగానే దీనిని చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు రావడంతో నిందితుడు పారిపోయాడు. దీనిపై కొడుకుపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రమేష్, ఎస్ఐ వెంకటేశ్వర్లు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా కేసులో పలుమార్లు విచారించి నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం జడ్జి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బంది లక్ష్మీనారాయణ, జమీల్ అహ్మద్‌లు నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేశారని వారిని అభినందించారు.



యావజ్జీవ కారాగార శిక్షపడ్డ ఇంద్రప్రసాద్

# నాలుగు రోజుల్లోనే బర్త్ సర్టిఫికెట్లు

- గతంలో ఇళ్లున్న వారిని గుర్తించి పట్టాలు రద్దు చేయాలి
- కలెక్టరు చామకూరి శ్రీధర్

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న అపారమైన కష్టాలకు ముగింపు పలికేందుకు కలెక్టరు చామకూరి శ్రీధర్ ఒక కొత్త పరిష్కారాన్ని సూచించారు. నాలుగు రోజుల్లోనే బర్త్ సర్టిఫికెట్లను సిద్ధం చేసి విద్యార్థులకు ఇవ్వాలని ఆదేశించారు. గురువారం కలికిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులతో కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అపార్ ఇబ్బందులు, అసంపూర్తి కాలనీలపై ఆయన దృష్టి సారించారు. విద్యార్థుల పుట్టిన తేదీకి సంబంధించిన ఆధారాలు లభ్యం కాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాల్సి ఉందని కలెక్టర్ చెప్పారు. ఇక నుంచి గ్రామ స్థాయి జనన నమోదు రిజిష్టర్లలో విద్యార్థి జన్మించిన తేదీకి సంబంధించిన ఆధారాలు లేకపోతే వెంటనే పంచాయతీ కార్యదర్శులు నాన్ అవైలబుల్ సర్టిఫికెట్లు జారీ చేయాలని చెప్పారు. ఆ తరువాత ఒకరోజు గడువుతో తహసీల్దారు, ఆర్డీవోలకు ప్రతిపాదనలు పంపాలని, రెండు మూడు రోజుల్లో ఆర్డీవోలు విద్యార్థి పుట్టిన తేదీకి సంబంధించిన వివరాలు జారీ చేయాలని తెలిపారు. మొత్తం వ్యవహారం నాలుగు రోజుల్లో ముగించాలని స్పష్టం చేశారు. పేదలు నిర్మిస్తున్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మార్చి నెలకల్లా పూర్తి చేయించాలని ఆదేశించారు. మార్చి తర్వాత ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు వచ్చే అవకాశాలు తక్కువగా వున్నాయని కలెక్టర్ వివరించారు. సకాలంలో ఇళ్లు పూర్తి చేసేందుకు మహిళా సంఘాల సభ్యులకు రుణాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. కాలనీలో ఇళ్లను మరోసారి తనిఖీ చేసి ఇది వరకే ఇళ్లు ఉన్న లబ్ధిదారులను గుర్తించి కాలనీల్లో అలాంటి వారికి కేటాయించిన పట్టాలు రద్దు చేయాలన్నారు. మంజూరైన ప్రతి ఇంటికీ జియో ట్యాగ్ పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చే అర్జీలను కనీసం 12 రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన పురోగతిని ఎంపీడీవో రోజువారీ సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన కలికిరి కొత్తపల్లె కాలనీని సందర్శించి త్వరగా నిర్మాణాలను పూర్తి చేయించాలని ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. సమావేశంలో మదనపల్లె, రాయచోటి ఆర్డీవోలు రామచంద్ర, శ్రీనివాస్, హౌసింగ్, డ్వామా, డీఆర్డీఏ పీడీలు శివయ్య, వెంకటరత్నం, సత్యనారాయణ, డీపీవో బలరామిరెడ్డి, ఎంపీడీవో భానుమూర్తిరావు, ఇన్‌చార్జి తహసీల్దారు నవీన్, ఎంఈవోలు, ఇంజనీర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి ఇంజనీర్లు పాల్గొన్నారు.

కలికిరి కొత్తపల్లె కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్



# రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ విజేత శ్రీకాకుళం

- బాలురు, బాలికల రెండు విభాగాల్లోనూ..
- గెలుపోటములను సమానంగా స్వీకరించాలి : జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేతలుగా శ్రీకాకుళం జట్లు నిలిచాయి. బాలురు, బాలికల రెండు విభాగాల్లోనూ శ్రీకాకుళం జిల్లా జట్లు గెలుపొందాయి. ములకలచెరువులో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, బుధ, గురువారాలు జరిగాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాలకు సంబంధించి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన క్రీడా సంబరం గురువారం సాయంత్రం ముగిసింది. రాష్ట్ర స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించేందుకు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి సహాయ, సహకారాలు అందించారు. రూ.3 లక్షలు నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించిన ఆయన జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్యాబినేట్ సమావేశం కోసం అమరావతికి వెళ్లినందున ఆయన వస్తూనే గెలుపొందిన జట్లకు నగదును అందజేస్తామని ఆయన తెలిపారు. బాలురు, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం జట్లకు, రన్నర్స్‌గా నిలిచిన చిత్తూరు, విశాఖపట్నం జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. అనంతరం జయచంద్రారెడ్డి ఆయన సతీమణి కల్పన రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత, సీఐ రాజారమేష్, తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ, ఎస్ఐ గాయత్రి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు సురేంద్రనాయుడు, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం జట్లతో టీడీపీ నేత జయచంద్రారెడ్డి

### హోరాహోరీగా సాగిన పోటీలు

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సా గాయి. గురువారం జరిగిన బాలుర విభాగం క్వార్టర్ ఫైనల్స్‌లో విశాఖపట్నం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జట్లు గెలిచి సెమీస్‌కు చేరాయి. అలాగే బాలికల విభాగంలో శ్రీకాకు ళం, క్రిష్ణా, విశాఖపట్నం, నెల్లూరు జట్లు గెలిచి సెమీస్‌కు చేరాయి. బాలుర విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖప ట్నం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో శ్రీకాకు ళం జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. మరో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. అనంతరం శ్రీకాకుళం, చిత్తూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో జరిగిన ఫైనల్స్‌లో మొ దటి మ్యాచ్ చిత్తూరు, రెండవ మ్యాచ్ శ్రీకాకుళం గెలుపొందాయి. ఉత్కంఠ భరితంగా జరిగి న మూడవ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ప్రత్యర్థి జట్టు చిత్తూరుపై ఐదు పాయింట్ల ఆధిక్యంతో విజేతగా నిలిచింది. అలాగే బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, క్రిష్ణా జట్లు తలపడగా శ్రీకాకుళం గెలుపొంది ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్‌లో విశాఖపట్నం, నెల్లూరు జట్ల మధ్య జరగ్గా విశాఖపట్నం గెలిచి ఫైనల్ చేరింది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో మొదటి, రెండవ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు సత్తా చాటి విశాఖపట్నం జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది.

# గురి పెడితే.. పతకమే...



● మెరిసిన ప్రొద్దుటూరు ఆణిముత్యం ● రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్న మహమ్మద్ ఉబైద్

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కఠోర దీక్ష.. పట్టుదల... ఏకాగ్రత... అలుపెరుగని సాధన... లక్ష్యంపై గురి ఇలా అన్ని లక్షణాలు అందిపుచ్చుకుని బరిలో దిగితే పతకాల పంటే. ఒకపక్క చదువు, మరోపక్క ఎంచుకున్న క్రీడపై ఆసక్తి పెంచుకుంటున్నాడు. రైఫిల్ షూటింగ్ క్రీడలో ప్రావీణ్యం పొంది మూడేళ్లలో తొమ్మిది స్వర్ణపతకాలు సాధించి ఆణిముత్యంలా నిలిచాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నాడు. పిల్లల ఆసక్తి బాల్యంలో గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని నిరూపిస్తున్నాడు షేక్ మహమ్మద్ ఉబైద్.

### కుటుంబ నేపథ్యం

ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని రాజరాజేశ్వరి కాలనీకి చెందిన షేక్ జాకీర్, అఫ్సానాభాను దంపతులకు ఇద్దరు కుమారులు. ఇతను పెద్ద కుమారుడు. తల్లి గృహిణి. తండ్రి ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉబైద్ శ్రీ చైతన్య స్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు.

### గురి పెట్టాడంటే...

2021 నుంచి జార్జిక్లబ్‌లో రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న ఉబైద్ 2022 సంవత్సరం రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓపెన్‌సైట్ కేటగిరీ సబ్‌యూత్, యూత్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు.

● 2022లో ఎస్‌జీఎఫ్‌ఐ తరపున రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-19 కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఢిల్లీలో జరిగే నేషనల్ మ్యాచ్‌కు సెలెక్టు అయ్యాడు.

● 2023 జూన్‌లో ఢిల్లీలో జరిగిన నేషనల్ కాంపిటీషన్‌లో పాల్గొన్నాడు.

● 2023లో ఎస్‌జీఎఫ్ తరపున రాజమండ్రిలో నిర్వహించిన స్టేట్‌లెవెల్ కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-19 కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. భోపాల్‌లో జరిగే మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.

● 2023 డిసెంబరులో భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

● 2024 ఆగస్టు నెలలో రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున హైదరాబాదులో నిర్వహించిన స్టేట్‌లెవెల్ పోటీల్లో ఓపెన్‌సైట్ కేటగిరీలో సబ్‌యూత్, యూత్, జూనియర్ మెన్, మెన్ కేటగిరిరీలలో నాలుగు బంగారు పతకాలు సాధించాడు.

● 2024 అక్టోబరులో ఎస్‌జీఎఫ్‌ఐ తరపున రాజమండ్రిలో నిర్వహించిన స్టేట్‌లెవెల్ కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-17 కేటగిరీలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.



సాధించిన పతకాలు.. తండ్రి షేక్ జాకీర్‌తో ఉబైద్



ఏపీ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ మేనేజర్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా ఒకేసారి అందుకున్న నాలుగు స్వర్ణాలు (ఫైల్)

### దేశం తరపున ఆడాలన్నదే లక్ష్యం



జీవితకాలంలో ఒక్కసారైనా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలన్నదే నా ఆశయం. ఒలింపిక్స్‌లో ఆడాలనే తపన నాలో కసిని పెంచుతున్నది. దేశానికి పేరుకు తీసుకురావాలన్నది నా కోరిక. ఈ ఏడాది డిసెంబరు 25 నుంచి భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. నేను ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాను. ప్రతి రోజూ ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు రైఫిల్ షూటింగ్ సాధన చేస్తాను. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు కావడంతో ప్రస్తుతం రోజుకు రెండు గంటల సమయం కేటాయిస్తున్నాను. పదవ తరగతి తర్వాత విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉన్న విశ్వశాంతి జూనియర్ కళాశాలలో చేర్పించాలని మా నాన్న నా ఆశయ సాధనకు సహకరిస్తున్నారు. అందుకు కారణం ఆ కళాశాలలో రైఫిల్ షూటింగ్ ఉండడమే. కోచ్ రాఘవేంద్ర శిక్షణతో క్రీడల్లో అరంగేట్రం చేశాను. 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో పాల్గొని తొమ్మిది స్వర్ణ పతకాలు సాధించాను.

- షేక్ మహమ్మద్ ఉబైద్, రైఫిల్ షూటర్

## తాళ్ళపాక ఇండస్ట్రియల్ భూములపై
# ఏపీఐఐసీకి అధికారాలు బదలాయింపు

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం మదనగోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 46.16 ఎకరాల పారిశ్రామిక భూముల అజమాయిషీని గ్రామ పంచాయతీ నుంచి ఏపీఐఐసీకి బదలాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పారిశ్రామిక అవసరాల కోసం తాళ్లపాక గ్రామానికి చెందిన 46.16 భూములు సిద్ధమయ్యాయి. ఇవి మదనగోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఈ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమల స్థాపన కోసం పనులు ప్రారంభించేందుకు కొన్ని గ్రామ పంచాయతీలకు ఉన్న అధికారాలను పారిశ్రామిక సంస్థ (ఏపీఐఐసీ)కు బదలాయించాల్సి ఉంది. తాళ్లపాక రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 1270/1, 1273, 1279, 1280, 1281, 1282లోని మొత్తం 46.16 ఎకరాల ప్రభుత్వ భూములు ఏపీఐఐసీకి పరిశ్రమల స్థాపన కోసం సిద్ధం చేశారు. అయితే పంచాయతీరాజ్ చట్టం మేరకు ఈ భూముల అజమాయిషీ వ్యవహారాలు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. పరిశ్రమల కోసం భూములను అభివృద్ధి చేసి, పరిశ్రమలు ప్రారంభించిన తరువాత వచ్చే ఆదాయాన్ని మదనగోపాలపురం గ్రామ పంచాయతీ, ఏపీఐఐసీలు 50:50 దామాషాతో పంచుకునే షరతుతో ఈ భూములపై ఉన్న పంచాయతీ అధికారాలను ఏపీఐఐసీకి బదలాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ గ్రామ పంచాయతీ కూడా గతంలో తీర్మానం చేసింది. దీంతో పంచాయతీలకున్న అధికారాలను ఏపీఐఐసీకి బదలాయిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

రాయచోటిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా నుంచి రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగం నుంచి రెడ్డిబాలాజీ, సాయి, జస్వంత్, బాలికల విభాగం నుంచి నాగతేజ, వేణుమాధవి, చైతన్యశ్రీ పాల్గొనగా వారిలో జాతీయ స్థాయి జట్టుకు సాయి, చైతన్యశ్రీలు రెండు విభాగాల్లో ఎన్నికైనట్లు జిల్లా హాకీ అకాడమీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా హాకీ కోచ్ చంద్ర, రాజు స్కూల్స్ హెడ్‌మాస్టర్ ఉమామహేశ్వరి తెలిపారు. వీరు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆడనున్నారు. వీరితో పాటు అండర్-14, అండర్-19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల్లో శ్రీనిధి, చైత్ర, బాలుర విభాగంలో హర్ష, వర్మ, జగన్, శానక్, వెంకటేశ్, నందినిలు వైజాగ్, కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాజు హాకీ అకాడమీ నుంచి 14 మంది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఆడుతున్నట్లు తెలియజేశారు.

# యువకుడు ఆత్మహత్య

నందలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తపి గ్రామంలో నువ్వుల సతీష్ (25) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. మంగళవారం ఇంట్లోకి వెళ్లిన యువకుడు రెండు రోజులుగా బయటకు రాలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. వారు ఇంటికి వెళ్లి చూడగా సతీష్ ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

కాగా తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని మృతుడు సూసైడ్ నోట్‌లో రాశాడు. మృతుడి తల్లిదండ్రులు జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లారు.

# ఆర్‌అండ్‌బీ రిటైర్డు ఈఈపై విచారణ

● అనంతపురానికి చెందిన ఇంజనీర్లపై కూడా

● విజిలెన్స్ విచారణలో వెలుగులోకి పలు అక్రమాలు

● ఏడాదికి పైగా చర్యలు లేకుండా వెనకేసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో కడప ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసి రిటైర్ అయిన పి.రవీంద్రబాబుపై విచారణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవీంద్రబాబుతో పాటు అదే సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేసిన మరో 8 మంది ఇంజనీర్లపై కూడా ప్రభుత్వం బుధవారం విచారణకు ఆదేశించింది. ఆ జిల్లాలోని పెనుగొండ-ముదిగుబ్బ-దొరిగల్లు మధ్య 28వ కి.మీ నుంచి 68వ కిలోమీటరు వరకు జరిగిన రోడ్డు విస్తరణ పనుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం రిటైర్ అయిన కడప ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రబాబుతో పాటు ఆ రోడ్డు పనులు పర్యవేక్షించిన మరో ఎనిమిది మంది ఇంజనీర్లు వివిధ రకాల అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ తేల్చింది. రవీంద్రబాబుతో సహా ఈ రహదారి విస్తరణ పనులను పర్యవేక్షించిన ప్రస్తుతం బద్వేలు డీఈఈగా పనిచేస్తున్న బి.ఎస్. సలీమ్, అనంతపురం డీఈఈగా ఉన్న ఎస్. బాల కాటమయ్య, కల్యాణదుర్గం ఈఈ వి.రాజగోపాల్, కల్యాణదుర్గం డీఈఈ జి.వెంకటసుబ్బయ్య, పెనుగొండ ఏఈఈ ఎ.వెంకటేష్, విజయవాడ ఎయిర్‌పోర్ట్ అథారిటీ డీఈఈ డి.పద్మజ, ధర్మవరం ఏఈ ఆర్.రవీంద్ర, విజయవాడ ఎన్‌హెచ్ ఈఈ జి.సంజీవరాయుడులపై విజిలెన్స్ అధికారులు పలు అభియోగాలను నమోదు చేశారు. వీరంతా కుమ్మక్కై రహదారి పనుల్లో అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డట్టు నిర్ధారించింది. ఈ తొమ్మిది మంది ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ 2023 మార్చి 20వ తేదీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే అప్పటి ప్రభుత్వం విజిలెన్స్ సిఫారసులకు సంబంధించిన నివేదికపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా పక్కన పెట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ నివేదికను వెలికితీసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొనేందుకు విచారణకు ఆదేశించింది. ప్రాథమికంగా విజిలెన్స్ గుర్తించి ప్రస్తావించిన వైఫల్యాలపై తగిన వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీరు సంజాయిషీలు పంపుకోవడానికి 10 రోజుల గడువిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే వేర్వేరుగా పది జీవోలను బుధవారం విడుదల చేశారు. కడప ఈఈ రవీంద్రబాబు రిటైర్ అయినందున పెన్షన్ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని మరో జీవోలో ఆదేశించారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దీపం సిలిండర్

● జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దీపం-2 పథకం ద్వారా ఉచిత సిలిండర్ రాయితీ లభిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 1వ తేదీ నుంచి దీపం-2 పథకం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో శాసనసభ సభ్యులందరూ, ప్రజాప్రతినిధుల ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించారని, దీపం-2 పథకానికి జిల్లా వ్యాప్తంగా మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 33 వేలకు పైగా సిలిండర్లు బుక్ చేసుకున్నారని అందులో దాదాపు 21 వేల సిలిండర్లు డెలివరీ కూడా చేశారన్నారు. సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ రావడం లేదని కొంతమంది నుంచి ఫిర్యాదు అందుతోందని, ఎవరికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే 1967 నెంబర్‌కు ఫోన్ చేసి ఎల్పీజీ నెంబర్ లేదా ఫోన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్, రైస్‌కార్డు నెంబర్ తెలపవచ్చన్నారు. లేదా సచివాలయాల్లో పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.


# మహిళ మృతిపై ఉన్నతాధికారుల విచారణ



మృతురాలి కుమారుడిని విచారిస్తున్న అధికారులు

పీలేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో గత నెల 30వ తేదీ మహిళ మరణించిన ఉదంతంపై జిల్లా రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గురువారం విచారణ చేశారు. కేవీపల్లె మండలం గోరంట్లపల్లెకు చెందిన సి.కృష్ణమ్మ (55) ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో మరణించడం, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందన్న వామపక్ష సంఘాల ఆరోపణలు, ఫిర్యాదులతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రి వైద్యులు, రాయచోటిలోని ఏరియా ఆసుపత్రి వైద్యులతో విచారణ బృందాన్ని నియమించారు. విచారణ బృందం గురువారం ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో విచారణ జరిపింది. మృతురాలి కుమారుడు నాగేశ్వర, ఆమెకు వైద్యం అందించిన డాక్టర్ వసీంలను విచారించారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఐసీయూ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహించామని, విచారణ సారాంశాన్ని నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

# ఏపీఎస్‌బీసీఎల్‌లో పాత వస్తువుల విక్రయం



వేలం వేస్తున్న డిపో మేనేజర్, అధికారులు

మదనపల్లె టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపో పరిధిలోని 69 ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న పాత వస్తువుల విక్రయం ద్వారా రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం పుంగనూరు రోడ్డులోని డిపోలో పాత ఫ్రీజర్లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్‌చెస్ట్, స్కానర్లను బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 27 మంది రూ.5 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వీటిలో 44 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 21 క్యాష్ చెస్ట్‌లను వేలంలో పలువురు పాడుకున్నారు. దీంతో రూ.2,02,635 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని ఏపీఎస్‌బీసీఎల్ ఖాతాకు జమ చేస్తామని డిపో మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. మిగిలిపోయిన ఫ్రీజర్లు, బ్యాటరీ ఇన్వర్టర్ల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి ఆదేశాలతో తిరిగి వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు, సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్, స్టోర్ ఆఫీసర్ నరేంద్ర పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిక

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదికను మండల రెవెన్యూ అధికారులు అందజేశారు. మండలంలోని అమ్మచెరువు మిట్ట వద్ద తెట్టు, అంగళ్లు రెవెన్యూ పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో 'దర్జాగా అమ్మేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది.

దీనిపై జిల్లా అధికారులు స్పందించి దీనికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంబేపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వేగవంతంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించి సూచనలు, సలహాలు చేశారు. అపార్‌ఐడీ ప్రగతిపై సమీక్షించారు. వీఆర్‌వో, పంచాయతీ సెక్రటరీలు ప్రతి పాఠశాలను సందర్శించి, బర్త్ సర్టిఫికెట్లు లేనివారిని నో అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇచ్చి బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని, అనంతరం విద్యార్థుల ఆధార్ అప్డేషన్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి లేఅవుట్ వారీగా దశలవారీ ప్రగతిపై మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష చేశారు. మంజూరైన ప్రతి ఇంటిని మూడు రోజుల్లోపు జియో ట్యాగ్ చేయాలని తెలిపారు. అనంతరం సంబేపల్లె అంగన్వాడీ ప్రీ స్కూల్‌ను తనిఖీ చేశారు. అంగన్వాడీ స్కూల్‌ను మరింత మెరుగ్గా నిర్వహించాలని టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్‌లను ఆదేశించారు. సంబేపల్లె ప్రకాశ్‌నగర్ కాలనీలో ఒకే పట్టాను ఇరువురు వ్యక్తులకు ఇచ్చిన అంశంలో స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి రికార్డులను, స్థలాన్ని పరిశీలించారు. స్థలానికి పక్కాగా కొలతలు వేసి అందజేయాలని, మరొక వ్యక్తికి అర్హతను బట్టి వేరే ప్రాంతంలో ఇంటి పట్టా మంజూరుకు సిఫారసు చేయాలని అధికారులను ఆదేశించారు.

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో హైవే నుంచి కేజీబీవీ స్కూల్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల వరకు 287 మీటర్ల మేర నిర్మించిన సీసీ రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల నిర్మాణం నాణ్యతలో ఎక్కడ రాజీపడరాదని అధికారులకు సూచించారు. పనులన్నీ డిసెంబరులోగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, డీపీవో బలరామిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో రామచంద్ర, ఎంఈవోలు, హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు, పంచాయతీ సెక్రటరీలు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 837 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపైనే సూర్యుని వేడిని విద్యుత్‌గా మార్చుకోవడం వల్ల ఆర్థికంగా కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, నెడ్ గ్యాప్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్లారెడ్డి, ఎల్‌డీయం ఆంజనేయులు, కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్ భారతి, మల్లూరు పంచాయతీ సర్పంచ్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ కరెక్షన్‌కు డబ్బుల వసూళ్లు

● ఒక్క పనికి రూ.350 నుంచి రూ.750 ● మున్సిపల్, సచివాలయాల్లో ఇదీ పరిస్థితి

మదనపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో బర్త్ సర్టిఫికెట్‌లో కరెక్షన్ కోసం మున్సిపల్, పంచాయతీ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. వీరు పడే ఇబ్బందులు ఒక ఎత్తయితే, అందుకయ్యే ఖర్చు కూడా తడిసిమోపెడవుతోంది. ఇందుకోసం మదనపల్లె మున్సిపల్ కేంద్రానికి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో క్యాష్‌కౌంటర్ ముందు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రద్దీగా ఉంటోంది. అలాగే రెండు వార్డు సచివాలయాలు కూడా ఇదే తరహాలో కిక్కిరిసిపోతున్నాయి. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు మున్సిపల్, సచివాలయ సిబ్బంది వసూళ్ల పర్వానికి తెరలేపారు. దరఖాస్తు నింపడం నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, ఆమోదం వరకూ బాధితులకు చేతి చమురు వదిలిపోతోంది. సాధారణంగా జనన ధ్రువీకరణ పత్రంలో ఏదైనా కరెక్షన్ చేయాలంటే రూ.100 చలానా రూపంలో మున్సిపాలిటీకి చెల్లిస్తే అక్కడ మనకు కావాల్సిన సేవలు పొందవచ్చు. కానీ అపార్ ఐడీతో రద్దీ పెరగడంతో వీరు ఫీజు కూడా భారీగా పెంచేసినట్లు చెబుతున్నారు. రూ.వందతో పోయే పనికి రూ.350 నుంచి రూ.750 వరకు ఖర్చు అవుతోందని బాధితులు వాపోతున్నారు. మొదటగా తమకు కావాల్సిన కరెక్షన్‌ను దరఖాస్తులో పూరించి సచివాలయంలో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నప్పుడు ఇన్షియల్‌తో ఉండగా తాజాగా విద్యాసంస్థలు సర్‌నేమ్‌తో సర్టిఫికెట్ అడుగుతున్నారు. ఈ క్రమంలో సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకెళితే కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు.

వీటిని మున్సిపల్ కార్యాలయం నుంచి త్యాగరాజు, కోటగడ్డ, చంద్రవిలాస్, కృష్ణానగర్ సచివాలయాలకు పంపుతున్నారు. అక్కడ అప్‌లోడ్ చేయగానే, మున్సిపల్ కార్యాలయంలో అప్రూవల్ ఇస్తే, తమకు కావాల్సిన ప్రింట్ అవుట్ తీసుకోవచ్చు. ఈ ప్రక్రియ వారం, పది రోజులు పడుతుందని చెబుతుండగా అవసరం మేరకు సొమ్ములు తీసుకుని ఇచ్చేస్తున్నారు. సర్టిఫికెట్‌లో ఒకటి కంటే ఎక్కువ కరెక్షన్ ఉంటే, ఒక్కోదానికి రూ.350 నుంచి రూ.1000 తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇలా వంద రూపాయలతో పోయే పనిని రూ.350 నుంచి రూ.750, ఆపై వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఎక్కువ డబ్బులు వసూలు చేసినట్లు ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. ఒక్కో కరెక్షన్‌కు రూ.100 అది కూడా మున్సిపాలిటీలో చలానా రూపంలో చెల్లించాలి. అంతకుమించి వసూలు చేస్తే క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె





మున్సిపల్ కార్యాలయంలో క్యూకట్టిన జనాలు - చంద్రవిలాస్ సచివాలయంలో కరెక్షన్ కోసం ప్రజల రద్దీ

# వేంపల్లెకు వస్తే ట్రాక్టర్లతో తొక్కిస్తాం

● పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లకు ఓ నేత హుకుం

పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ట్రాక్టర్లు వేంపల్లె వద్దనున్న పాపాఘ్ని ఇసుకకు రాకూడదని, వస్తే ట్రాక్టర్లతో తొక్కిస్తామని ఓ నాయకుడు బెదిరింపులకు దిగారు. కొన్నిరోజులుగా పాపాఘ్ని నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను పులివెందులకు చెందిన కొంతమంది తరలిస్తున్నారు. కానీ గురువారం వేంపల్లెకు చెందిన ఓ నాయకుడు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్లు మళ్లీ ఇసుకకు వస్తే ట్రాక్టర్లతోనే తొక్కిస్తామని వారిని బెదిరించారు. అప్పటికే ట్రాక్టర్లలో నింపిన ఇసుకను అన్‌లోడ్ చేయించి వెనక్కు పంపారు. వేంపల్లెకు చెందిన ట్రాక్టర్లు కూడా ఇసుక తీసుకెళ్లాలంటే రూ.100 గేటు, కూలీలు రూ.500 చెల్లించాలని చెప్పారు. దీంతో గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో పలువురు డ్రైవర్లు పులివెందులలోని కడపరోడ్డులో ట్రాక్టర్లను నిలిపి ఆందోళన చేశారు. ఇదే సమయంలో వేంపల్లెకు చెందిన ట్రాక్టర్లు ఇసుకతో రావడంతో వాటిని పులివెందులలోకి వెళ్లనివ్వకుండా ఆపేశారు. తమను వేంపల్లెకు రానివ్వనప్పుడు.. వేంపల్లె ట్రాక్టర్లు పులివెందులలోకి ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. అనంతరం 12గంటల ప్రాంతంలో వేంపల్లెకు చెందిన ఇసుక ట్రాక్టర్లను వెనక్కి తిప్పి పంపారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో సమస్య పరిష్కరించుకుంటామని పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపారు. పులివెందుల వాసులు ఇసుక తెచ్చుకోవాలంటే ఇటు పాపాఘ్నికి గాని, అటు చిత్రావతికి గాని వెళ్లాల్సి ఉంటుంది. చిత్రావతికి వెళ్లాలంటే చాలా దూరం. దీంతో పాపాఘ్నికే వెళుతుంటారు. అయితే అక్కడి నాయకులు వీరిని అడ్డుకోవడం వివాదానికి కారణం అవుతోంది.



ఆందోళనకు దిగిన పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లు



పులివెందులలో నిలిపివేసిన వేంపల్లె ఇసుక ట్రాక్టర్లు

## టెక్స్‌టైల్‌పార్కు, జలాశయాల పరిశీలన



సోలార్‌ప్లాంట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆది

మైలవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టెక్స్‌టైల్ పార్కును, మైలవరం జలాశయాన్ని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురువారం పరిశీలించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీతో కలిసి టెక్స్‌టైల్ పార్కును పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. చేనేత సంఘ నేతలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే టెక్స్‌టైల్ పార్కును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మైలవరం జలాశయాన్ని పరిశీలించి నీటి నిల్వపై ఆరా తీశారు. పొన్నం పల్లి వద్దనున్న సోలార్ ప్లాంట్‌ను పరిశీలించి.. పవర్ ప్రాజెక్ట్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సోలార్, జలాశయ, టెక్స్‌టైల్ పార్కు అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

వేముల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో మండల మహిళా సమాఖ్యలో గ్రామ సమాఖ్య అసిసెంట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తులు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ విధానంలోకి తీసుకురావాలన్నారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుదలకు బ్యాంకుల ద్వారా నారిశక్తి రుణాలను, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ సబ్సిడీరుణాలను అనుసంధానం చేయలని ఆదేశించారు. వెలుగు ఏపీఎం ఆంజనేయులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు జ్యోతి, జైపాల్, హరికృష్ణ, నాగేశ్వరి, గంగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య భర్త మృతి



జానా శివప్రసాద్, శైలజ మృతదేహాలు

వల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని వల్లూరు మండల కేంద్రానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కడపకు చెందిన జానా శివప్రసాద్ (40) అతని భార్య శైలజ (35) ఇరువురూ ద్విచక్ర వాహనంలో కమలాపురం మండలం చదిపిరాళ్లకు వెళ్లి... తిరిగి కడపకు వస్తుండగా వల్లూరుకు సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు రాగానే కడప నుంచి కమలాపురం వెళుతున్న లారీ (కంటైనర్) ఢీకొన్న సంఘటనలో శైలజ సంఘటనాస్థలిలో మృతి చెందింది. కొన ఊపిరితో ఉన్న భర్త శివప్రసాద్‌ను 108లో కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. జానా శివప్రసాద్ సిద్దవటంలో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా... భార్య ఇంటి వద్ద గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు విఘ్నేశ్ (8), లక్ష్మి (12) ఉన్నారని పోలీసులు తెలిపారు .ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

## నిప్పంటించుకుని మహిళ మృతి



పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న యాదవ్‌గుంట రాజేశ్వరి (48) గురువారం నిప్పంటించుకుని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. పులివెందులకు చెందిన సదాశివారెడ్డితో ఆమెకు 30 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత పదేళ్ల నుంచి మానసికంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిప్పంటిచుకుంది. భర్త ఇంటికి వచ్చి చూడగా.. మంటలు వస్తుండడంతో అక్కడికి వెళ్లి మంటలు అదుపు చేశారు. చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సలు చేసి అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు రెఫర్ చేయడంతో వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## చీటీలపేరుతో మోసం కేసులో... ఇరువురికి జైలుశిక్ష, జరిమానా

● శిక్షపడిన వారిలో మాజీ హోంగార్డు

కడప (క్రైం)నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ చీటీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేసి తిరిగి వారికి ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఇరువురికి నాలుగేళ్ల జైలు శిక్ష రూ.22వేలు జరిమానా విధిస్తూ సెషన్స్ జడ్జి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప రాజారెడ్డి వీధికి చెందిన రెడ్డి నాగులు అతడి భార్య లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి ప్రైవేట్ చీటీల వ్యాపారాలు చేస్తూ పలువురి నుంచి డబ్బులు తీసుకొని తిరిగి వారికి ఇవ్వకుండా మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మాజీ హోంగార్డు రెడ్డి నాగులు, అతడి భార్య లక్ష్మీదేవితో పాటు పాలెం శారద, వెంకట సుబ్బరాయుడు అలియాస్ సంజీవరాయుడు, రెడ్డిశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసు విచారణలో భాగంగా గురువారం రెడ్డినాగులు, లక్ష్మీదేవిలపై నేరం రుజువు కావడంతో జడ్జి ఇరువురికి నాలుగేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.11వేలు చొప్పున 22వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ముగ్గురిపై కేసును కొట్టేశారని తెలిపారు. ఈ కేసును పీపీ బాలాజీ వాదించినట్లు తెలిపారు.

## చీటింగ్ కేసులో భార్యభర్తలకు ఏడేళ్లు జైలు

కడప(క్రైం)నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్స్ నడుపుతూ 33 మంది నుంచి రూ.31 లక్షలు వసూళ్లు చేసి మోసం చేసిన భార్యభర్తలకు ఏడు సంవత్సరాల జైలుశిక్ష, 22వేలు జరిమానా విధిస్తు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు తాలు కా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప బాలజీనగర్‌కు చెందిన మల్లికార్జునరెడ్డి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న భార్య హరితమ్మతో కలిసి 2019లో ప్రైవేట్ చీటీలు నిర్వహించారు. 33 మంది నుంచి రూ.31లక్షలు వసూళ్లు చేసి తిరిగి చీటీలు వేసిన వారికి చెల్లించకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు 2019లో భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి విచారించిన జడ్జి వారిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు ఇద్దరికి కలిపి రూ.22 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసును పీపీ బాలాజీ వాదించినట్లు తెలిపారు.

## చిట్స్ పేరుతో మోసం చేసిన వ్యక్తికి..

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిట్స్ పేరుతో 92 మందిని మోసం చేసిన కేసులో ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన వై.శ్రీనివాసులరెడ్డికి ఏడేళ్ల జైలుశిక్ష రూ.18వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన వై.శ్రీనివాసులరెడ్డి చిట్స్ నడుపుతూ మోసం చేయడంతో 92 మంది బాధితులు అతనిపై ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు విచారణలో నిందితుడికి శిక్ష విధించినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

## భారీగా పట్టుబడ్డ రేషన్ బియ్యం అక్రమ నిల్వలు

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండిబజార్ రోడ్డులోని వాసవీ ట్రాన్స్‌పోర్టు సమీపంలో గదుల్లో రేషన్‌బియ్యం అక్రమ నిల్వలను సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి అక్రమ నిల్వలపై సమాచారం రావడంతో మండిబజార్‌లోని షాపింగ్‌కాంప్లెక్స్ గదులను పరిశీలించారు. ఈ గదుల యజమానులు ఎవరని విచారిస్తున్నారు. ఇందులో అక్రమ బియ్యం వున్నట్లు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లై డిటీ మల్లికార్జున, ఆర్ఐ సాయిప్రసాద్ రూరల్ ఎస్ఐ రఫీ పరిశీలించారు. రాత్రి పొద్దుపోవడంతో శుక్రవారం వీటిని సీజ్ చేయనున్నట్లు తెలిపారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● అభివృద్ధి ప్రణాళికలను జాగ్రత్తగా తయారు చేయాలి ● డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ





సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ

కడప రూరల్, అక్టోబర్ 7,(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ కోసం రెండురోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు సద్వినియోగం చేసుకుని.. 2025-26 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ (జడ్పీ సీఈవో) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపాల్(డీపీవో) రాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన రెండో బ్యాచ్ జిల్లాస్థాయి టాట్స్ శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ)నిధులతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) ఆద్వర్యంలో జీపీడీపీ ప్రణాళిక తయారీపై శిక్షణ ఇవ్వడం జరు గుతుందన్నారు. ఈమేరకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో రెండో బ్యాచ్ శిక్షణను 7,8 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ పట్ల అశ్రద్ద వహించరాదన్నారు. ఈ శిక్షణ ద్వారా క్షేత్రస్థాయి వరకు సరైన అవగాహన లభిస్తేనే రాబోయే సంవత్సరం ప్రణాళిక సక్రమంగా తయారు చేయటం, అమలు చేయటం వీలుపడుతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల విషయంలో మనం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. ఇందు కోసం ఈశిక్షణా కార్యక్రమాన్ని ప్లాన్ తయారీ, అమలు, ఆడిట్‌ల ప్రాధాన్యతపరంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. శిక్షణను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థకు చెందిన అధికారులు అబ్జర్వర్లుగా హాజరై పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ శిక్షణలను ముఖ్యంగా గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలో 2025-26 సంవత్సరానికి తయారు చేయాల్సిన ప్రణాళికలను సమర్థవంతంగా తయారు చేసి తద్వారా పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధుల విడుదలలో సమస్యలు రాకుండా చూసుకునే విధంగా అవగాహన కోసం ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి కాగానే మండలస్థాయిలలో నవంబర్ 12 నుంచి 16 వరకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు, లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు శిక్షణ ఉంటుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని... తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. శిక్షణలో డీఎల్‌పీవోలు, డీపీఆర్సి కో-ఆర్డినేటర్ భాస్కర్, ఏవో బండపల్లి నాగభూషణం, సురేష్, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించిన శాప్ ఛైర్మన్



స్పోర్ట్స్ స్కూల్ వంటశాలలో పరిశీలిస్తున్న శాప్ ఛైర్మన్

కడప స్పోర్ట్స్ నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్‌లోని హాస్టల్‌ను గురువారం శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పరిశీలించారు. అక్కడి విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. బాలికల వసతి గదులు అధ్వానంగా ఉన్న సంగతిని గ్రహించారు. అందులో గల ఫ్యాన్లలో కొన్ని తిరగడం మానేసినట్లు గుర్తించారు. వెలగని లైట్స్, నిర్వహణకు నోచుకోని టాయిలెట్స్ గుర్తించి అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భోజనశాల పరిశీలించి వంటలను రుచి చూసి నాణ్యత లోపించడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్తీనూనె, ఆహార పదార్థాలను గుర్తించి ఆరా తీయగా సదరు కాంట్రాక్టర్ నాసిరకం పదార్థాలను పంపిణీ చేస్తున్నట్లు అక్కడి వంట సిబ్బంది బదులిచ్చారు. దీంతో అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీఎస్డీఓకు ఆదేశాలిచ్చారు.

## వైసీపీ నేతలపై హత్యాయత్నం కేసు

మైదుకూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరామకృష్ణ, నేట్లపల్లి రామాంజనేయులుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. గతంలో మైదుకూరు మండలం నంద్యాలపేట రెవెన్యూ పొలం సర్వే నెంబరు 1910లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును పాతుతుండగా వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం అతని సోదరుడు రామాంజనేయులు ఈ పొలం మాది అంటూ వారిని అడ్డుకున్నారు. అంతేకాకుండా వారిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఈ నెల 2వ తేదీన కేసు నమోదు కాగా గురువారం వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

## యువతి ఆత్మహత్యాయత్నం

కడప (క్రైం), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలోని మల్టీస్పెషాల్టి ఆసుపత్రిలో పనిచేస్తున్న యువతి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి అక్కడే పనిచేస్తున్న యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఇరువురి మధ్య ఏం జరిగిందో కానీ యువతి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. దీంతో యువతిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైనా వైద్యం కోసం వేలూరికి తరలించినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చోరీ కేసులో మహిళ అరెస్టు

కడప (క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నబీకోటలో గతనెలలో జరిగిన చోరీ కేసులో మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు నబీకోటకు చెందిన దేవి ఇంట్లో నిందితురాలు కవిత గతనెల వెళ్లి బీరువాలో ఉన్న రూ.లక్ష 20వేలు నగదును చోరీచేసినట్లు తెలిపారు. భాధితురాలు దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కవితను అరెస్టు చేసి.. ఆమె వద్ద నుంచి రూ.50వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## దివంగత ఎంపీ డీఎన్‌రెడ్డి సతీమణి మృతి



పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ దివంగత నేత, స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ డీఎన్‌రెడ్డి సతీమణి డి.లక్ష్మిదేవమ్మ (95) గురువారం మృతి చెందారు. హైదరాబాద్‌లో గత ఐదు నెలలుగా కుమారుడు రమణారెడ్డి వద్ద ఉండేవారు. కొద్దిరోజుల నుంచి అనారోగ్యం బాధపడుతూ గురువారం మృతి చెందారు.

## 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులు దాడులు చేపట్టారు. గురువారం కోనేటికాల్వ వీధి, శివాలయం వీధి, గాంధీరోడ్డు తదితర ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్ చేశారు. ఈప్లాస్టిక్ వస్తువులను మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చి కమిషనర్ ఎదుట వుంచారు. కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ 120 మైక్రాన్‌లకంటే మందం తక్కువగా వున్న ప్లాస్టిక్ కవర్లు నిషేధమన్నారు. వ్యాపారులు వీటిని విక్రయించడం నేరమన్నారు. ప్లాస్టిక్ విక్రయ దారులకు జరిమానా విధించామన్నారు. ఈదాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీత సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అరటి వ్యాపారి ఐపీ.. ఆందోళనలో రైతులు

● 30 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఎగవేత

లింగాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తుని నమ్మక ద్రోహానికి అరటటి రైతులు బలయ్యారు. సుమారు 30 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఎగ్గొట్టిన ఉదంతం ఇది. రైతుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. లింగాల ఎస్ఐ మధుసూదన్‌రావు, రైతుల కథనం మేరకు వివరాలిలా..

మండలంలోని వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ మల్లికార్జునరెడ్డి అరటి కాయల వ్యాపారం చేసేవాడు. సాధారణంగా అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించిన తర్వాత వారం పది రోజుల్లోగా రైతులకు డబ్బులు ఇచ్చేవారు. అలా సుమారు 30 మంది రైతులకు చెందిన అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకొని రైతులకు ఇవ్వకుండా వ్యాపారస్తుడు పరారయ్యాడు. రైతులకు చెందిన డబ్బులను మల్లికార్జునరెడ్డి తన కుమార్తె వసుప్రియ, అల్లుడు భవానిరెడ్డిలు నూతనంగా నిర్మించిన ఇంటికి ఉపయోగించారని, తమకు డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇటీవల సుమారు 20 మంది రైతులకు వ్యాపారస్తుడు మల్లికార్జునరెడ్డి ఐపి నోటీసులు పంపడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో లింగాలకు చెందిన రైతు ముచ్చుమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తనకు రూ.8.25లక్షలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మల్లికార్జునరెడ్డి, అల్లుడు, కుమార్తె భవానీరెడ్డి, వసుప్రియలపై ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మధుసూదన్‌రావు వారిపై కేసు నమోదు చేశారు.

## అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు



బాలుర విభాగంలో ఛాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కడప జట్టు క్రీడాకారుడు

ఉంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల,బాలికల అథెటిక్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. రెండురోజుల పాటు జరిగిన ఈ పోటీలు కైకరం, నారాయణ పురం చింతలపాటి బాపిరాజు స్టేడియంలో జరిగాయి. బాలికల ఛాంపియన్‌గా అనంత పురం జిల్లా, బాలుర ఛాంపియన్‌గా కడప జిల్లా జట్లు విజయం సాధించాయి. పోటీల రాష్ట్ర పరిశీలకుడు ప్రసాదరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.అలివేలు, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు గుళ్ల ప్రసాదరావు వారికి బహుమతులు అందజేశారు.

## ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ పోటీలు

పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ క్రీడాప్రాంగణంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న సాఫ్ట్ టెన్నిస్ బాలుర విభాగం క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర విజేతలుగా కడప, అండర్ 17 విభాగంలో కడప, చిత్తూరు అండర్ 19 విభాగంలో గుంటూరు క్రీడాకారులు విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డీవీ కొండారెడ్డి, విశిష్టఅతిథి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు ప్రసంగించారు.

## నకిలీ భూపట్టాలపై ఆర్డీవో విచారణ

ఒంటిమిట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో నకిలీ భూపట్టాలను తయారు చేస్తున్నారన్న ఫిర్యాదుపై కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్ పాలపర్తి విచారణ చేపట్టారు. గురువారం తహసీల్దారు కార్యాలయానికి చేరుకొని సిబ్బందితో జరిగిన విషయాలపై రహస్యంగా ఆరాతీశారు. అమరావతిలోని సచివాలయంలో గత ప్రభుత్వంలో పెద్దఎత్తున నకిలీ పట్టాలతో మండలంలో భూ ఆక్రమణలు చేపట్టారని ఫిర్యాదులందాయి. 2049 సర్వే నెంబరులో పెద్ద ఎత్తున జగనన్న కాలనీలోని పట్టాల్లో ఆక్రమణలు జరిగాయని వాటిపై విచారణ చేయాలని కోరారు. ఇదే విషయంపై గతంలో 'పట్టా కొట్టు.. భూమి పట్టు' అనే కథనం ప్రచురితమైంది. ప్రస్తుతం నకిలీ పట్టాలపై ఆర్డీఓ విచారణ చేయడంతో భూ ఆక్రమణదారుల్లో ఆందోళన మొదలైంది.

## నైపుణ్య గణనపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

సంబేపల్లె, నవంబరు7(ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణన-2024 శిక్షణా కార్యక్రమాన్ని సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ సర్వేలో 15 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారి నుంచి సమగ్రడేటాను తీసుకుంటామన్నారు. దీని ద్వారా ప్రాంతీయ ఇండస్ట్రీకి అనుగుణంగా, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్కిల్ సెన్సెస్ కోసం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన నైపుణ్యం యాప్ ద్వారా అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ట్రైనర్‌లుగా పంచాయతీ కార్యదర్శులు చక్రవర్తినాయక్, చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు వినతి

రామాపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు కడప మున్సిపల్ ఇండోర్ స్టేడియానికి గురువారం విచ్చేసిన సందర్భంగా రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మల ఓబులేష్‌గౌడ్ గురువారం ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలో త్వరలో క్రికెట్ స్టేడియాన్ని పూర్తి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్‌నాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు నవీన్‌లు పాల్గొన్నారు.

## ఉరుసు ఉత్సవానికి సుగవాసికి ఆహ్వానం



ప్రసాద్‌బాబుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేది వరకు జరగనున్న కడప అమీర్ పీర్ దర్గా గంధం, ఉరుసు మహోత్సవానికి టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబును గురువారం దర్గా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా కడప దర్గా పీఠాధిపతుల శిష్య బృందం గంధం మహోత్సవ ఆహ్వాన పత్రికను రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో ప్రసాద్‌బాబును కలిసి అందజేశారు.

**చిన్నమండెం:** మండల కేంద్రంలోని బలిజపల్లెలో దశాబ్దాల చరిత్ర కలిగిన సపలమ్మ గ్రామదేవత దగ్గర జరిగే కోళ్ల దేవర మహోత్సవ కార్యక్రమానికి గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబుకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామస్థులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర, మలిరెడ్డి, సిద్దయ్య, జనార్ధన, నరసింహులు, బాలాజీ, శివ, నాగభూష, బాల, రాంప్రసాద్‌నాయుడు, తోహిద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుడికి రూ.73 వేలు ఆర్థిక సాయం



చెక్కును అందిస్తున్న మానవతా సభ్యులు

చిట్వేలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుక్కదాడిలో తీవ్రంగా గాయపడిన చిట్వేలి సత్యమ్మ వీధిలోని వెంకటరేవంత్ (రిషి) 8 ఏళ్ల బాలుడికి చిట్వేలి స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.73 వేలు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులు దాతల సాయం కోరడంతో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, సీహెచ్ఎస్ స్వచ్ఛంద సంస్థలు అండగా నిలిచాయి. ఈ మేరకు గురువారం స్థానిక శివాలయంలో సీహెచ్ఎస్ సభ్యులు రూ.40 వేలు, మానవత సభ్యులు రూ.33 వేలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్షుడు మునిరావు, కార్యదర్శి సాయిరాం, ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, తురక రంగారెడ్డి, రవీంద్రనాద్, అవినాష్, తేజ, పవన్‌రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

గాలివీడు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాలివీడు- కదిరి ప్రధాన రహదారి చిన్నఏరు పక్కన ఉన్న సర్వే నెంబరు 1055/3లో 0.14 సెంట్ల భూమి ప్రభుత్వ స్థలమని, అందులో చదును చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని ఫిర్యాదు రావడంతో గురువారం ఆ స్థలాన్ని పరిశీలించామని తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సంబంధిత సర్వే నెంబర్ పక్కనే ఆర్‌అండ్‌బీ స్థలం ఉన్నట్లు తెలిపారు. ఈమె వెంట ఆర్ఐ బాలాజీ, వీఆర్వో అల్లాబకష్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● టీడీపీ ఇన్‌చార్జ్ బాలసుబ్రమణ్యం





సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

సుండుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. గురువారం సుండుపల్లి సర్వసభ్య సమావేశం సందర్భంగా ప్రజాప్రతినిధుల పిలుపు మేరకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కరువు మండలం కావడంతో తాగు, సాగు నీటి సమస్యలపైన ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానన్నారు. రోళ్లమడుగు నుండి మండల ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు కావాల్సిన నిధులను తీసుకువచ్చేందు కృషి చేస్తానని తెలిపారు. ఝరికోన నుంచి బాహూదా నది ద్వారా కాలువల మంజూరుకు, అలాగే జి.రెడ్డివారిపల్లి గ్రామంలోని నారాయణరెడ్డి చెరువును నీటితో నింపితే ఆ నాలుగు గ్రామాల్లోని ప్రజలకు తాగు నీటి సమస్య తీరడంతో పాటు బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉంటుందని, సాగు నీటి సమస్యలు వుండవని గ్రామస్థులు కోరారన్నారు. అంతేకాక ఉపాధిలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల పనిదినాలు కల్పిస్తున్నట్లు, రైతులకు ఉపయోగపడేలా పనులు గుర్తించామని సంబంధిత అధికారులు వివరించారు. సుండుపల్లి మండలకేంద్రం, మడితాడు కస్బాలో డ్రేనేజి వ్యవస్థ సరిగ్గా లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు సమావేశానికి వచ్చి తెలియజేశారు. గుర్తించిన ప్రతి సమస్యను పై అధికారులకు రాత పూర్వకంగా అందజేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవో రాధాకృష్ణన్, ఏవో మహబూబ్ బాషా, ఎంఈవో వెంకటేష్‌నాయక్, ఏఈఈ నాగేంద్రనాయక్, సర్పంచ్ మహ్మద్ షరీఫ్, ఎంపీటీసీలు నసీమా బాను, నాగేశ్వరి, అమరావతి, సోమశేఖర్‌రెడ్డి, వైద్యాధికారులు హసన్‌అలి, శేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### లక్ష సభ్యత్వాలను పూర్తి చేస్తాం

రాజంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళామణుల సహకారంతో రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో లక్ష టీడీపీ సభ్యత్వాలను పూర్తి చేస్తామని టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం రాజంపేట మండలం కూచివారిపల్లె గ్రామంలో ఆ గ్రామ తెలుగు మహిళల ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ్యత్వ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ కూచివారిపల్లె గ్రామంలో మహిళలందరూ ముందుకు వచ్చి భారీఎత్తున సభ్యత్వ కార్యక్రమాలను నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా కూచివారిపల్లె రామాలయంలో సుగవాసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నేతలు గుప్తా శ్రీలత, అమ్మినేని రమాదేవి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నరసింహులు, తెలుగు యువత నాయకులు రవినాయుడు, ఆ గ్రామ సీనియర్ టీడీపీ నాయకులు వెంకటయ్యనాయుడు, బ్రహ్మయ్యనాయుడు, కిషోర్, సిద్దవటం టీడీపీ నాయకులు పుత్తా రామచంద్రయ్య పాల్గొన్నారు.

## శాప్ చైర్మన్‌కు సత్కారం



శాప్ చైర్మన్‌ను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

రాజంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో శాప్ చైర్మన్ రవినాయుడును టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం ఆయన రాజంపేటకు వచ్చిన సందర్భంగా టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత వెంకటరమణ, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు నరసింహ, టీడీపీ సీనియర్ నాయకులు నాగినేని నాగేశ్వరనాయుడు, చుండువారిపల్లె టీడీపీ నాయకులు రమణ, రాష్ట్ర టీడీపీ రజక సంఘ ప్రధాన కార్యదర్శి రామ్‌నగర్ నరసింహ, సిద్దవటం టీడీపీ నాయకులు పుత్తా రామచంద్రయ్య తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శాప్ చైర్మన్ మాట్లాడుతూ క్రీడల వల్లే కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని, రాష్ట్రంలో క్రీడల అభ్యున్నతికి అన్నివిధాల కృషి చేస్తానన్నారు. అన్ని క్రీడా మైదానాలను అభివృద్ధిపరుస్తామని తెలిపారు.

## దళితులపై వివక్ష

● ఇన్‌చార్జి తహసీల్దారుకు వినతిపత్రం

సిద్దవటం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తహసీల్దారు కార్యాలయంలో ఎస్.రాజంపేట గ్రామానికి చెందిన దళిత కుటుంబాల ప్రజలు మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవిలతకు గురువారం వినతిపత్రం సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో ఎవరైనా మరణిస్తే గత 30 ఏళ్లుగా వెళుతున్న స్మశానదారిని కొంతమంది అగ్రవర్ణాలకు చెందినవారు అడ్డుకుంటున్నారని, దళితులకు న్యాయం చేయాలని, ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే ఎక్కడ దహన సంస్కారాలు చేయాలో అర్థం కావడంలేదని దళితులు వినతి పత్రం సమర్పించారు. ఎగువ ప్రాంతం కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు అదే రహదారిన పెన్నానదిలోకి వెళతాయని, అటువంటి పురాతనమైన రహదారిని అగ్రవర్ణాలకు చెందినవారు అడ్డుకుంటున్నారని ఇన్‌ఛార్జి తహశిల్దారుకు తెలియజేశారు.

## లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం

పుల్లంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల లాభసాటిగా ఉంటుందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. మండల శివారు ప్రాంతంలోని మెంటార్ సుధామాధురి ప్రకృతి వ్యవసాయ పొలంలో రైతులకు సూచనలు చేశారు. ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచడం, మల్చింగ్, ఏటీఎం, ఘన, ద్రవ జీవామృతాల తయారీ తదితర పద్ధతులు పాటించడం వల్ల రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మెంటార్స్ పార్వతి, లక్ష్మీలత, చంద్రకళ, ప్రమీల, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## 'టీడీపీని భ్రష్టు పట్టించేందుకే'

వీరబల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): టీడీపీని భ్రష్టు పట్టించేందుకే వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వస్తున్నారని వీరబల్లి సొసైటీ ప్రెసిడెంట్, టీడీపీ నాయకులు రాంమోహన్‌రెడ్డి (బాబురెడ్డి) ఆరోపించారు. ఆయన గురువారం వంగిమళ్లలో టీడీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా వైసీపీకి వీరాభిమానులుగా ఉన్న వంగిమళ్ల, దిగువరాచపల్లి గ్రామాలకు చెందిన కొందిరిని చేర్చుకోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తోళ్ల సురేంద్ర, మాజీ సర్పంచ్ మల్లికార్జున, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## అందరికీ క్యాన్సర్ పరీక్షలు అవసరమే

ఓబులవారిపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముక్కావారిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షను ప్రతిఒక్కరూ చేయించుకోవడం ద్వారా ముందు నుంచి రక్షణ కల్పించుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పుల్లంపేట:** ముందస్తు పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని డాక్టర్ మనోజ్‌చంద్ర తెలిపారు. గురువారం పుల్లంపేటలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌చంద్ర మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఇంటివద్దనే క్యాన్సర్ వ్యాధి పరీక్షలు చేయడం వల్ల వ్యాధిని నిర్ధారించవచ్చని, దీన్ని జయించడంలో తొలి అడుగు స్క్రీనింగ్ చేయించుకోవడమే అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనిజ, సీహెచ్‌వో రాజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**లక్కిరెడ్డిపల్లె:** క్యాన్సర్ బారిన పడకుండా ప్రజలు జాగ్రతలు పాటించాలని కోనంపేట వైద్యాధికారి సిద్దయ్య పేర్కొన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గురువారం జాండ్రపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్దయ్య మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ రవీంద్ర, సూపర్‌వైజర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోప్యాయుడు రామక్రిష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయండి

● వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలను మానుకొని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డిలు అన్నారు. గురువారం వారు రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సివిల్ డ్రస్సుల్లో వస్తున్న పోలీసులు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను తీసుకెళ్లి ఎక్కడ పెడుతున్నారో చెప్పడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా పోలీసు అధికారులను సస్పెండ్ చేయడం, బదిలీలు చేయడంతో వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులను వెంటనే ఆపకపోతే పోలీస్‌స్టేషన్ల ఎదుట ధర్నాలకు దిగుతామని వారు హెచ్చరించారు.

## భూకబ్జాకు యత్నం - అడ్డుకున్న గ్రామస్తులు



కబ్జాకు యత్నిస్తున్న స్థలం ఇదే..

సిద్దవటం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ శాఖరాజుపల్లె రెవెన్యూ కడప - చెన్నై జాతీయ రహదారి పక్కన సర్వేనంబరు 937/ఎలో 40 సెంట్ల స్థలాన్ని కొంత మంది జేసీబీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతుండగా గురువారం స్థానికులు అడ్డుకున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయంపై మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా.. శాఖరాజుపల్లె రెవెన్యూ సర్వేనంబరు 937లో ఎటువంటి పనులు చేయకూడదని, ఈ స్థల వివాధంలో ఉందని తెలియజేశారు.

## బాధితుడికి అండగా గల్ఫ్ జనసైనికులు

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి లక్ష్మీ ప్యారడైజ్ థియేటర్ సమీపంలో మూడు నెలల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో జనసేన కార్యకర్త రెడ్డి మణి నిర్వహిస్తున్న హోటల్ పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న గల్ఫ్ జనసేన ఎన్ఆర్ఐ సభ్యులు కంచన శ్రీకాంత్, అల్లం రమణ, శ్రీధర్, ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ జగిలి ఓబులేసు, బిరదా సూర్యనారాయణ తదితరులు ఆర్థిక సహాయం చేయడంతో పట్టణంలోని కొత్త బస్టాండ్ వెళ్లే దారిలో నూతనంగా హోటల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గల్ఫ్ ఎన్ఆర్ఐ సభ్యులకు జనసేన కార్యకర్త రెడ్డి మణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కువైత్ ఎన్ఆర్ఐ మీడియా సభ్యులు మర్రి రెడ్డి రాయల్, జనసేన నాయకులు అల్లం పిచ్చయ్య, ముద్దపోలు సభాపతి, ముత్యాల కిషోర్, దాసరి వీరేంద్ర, శ్రీకారం ప్రకాష్, పగడాల మణి, లాయర్ చంద్ర, నగిరిపాటి మహేష్, నల్లంశెట్టి కిషోర్ పాల్గొన్నారు.

## తహసీల్దారు కార్యాలయం ఎదుట వృద్ధుడు హల్‌చల్

● ఎండార్స్‌మెంటు ఇవ్వలేదని కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన తెల్పుతున్న దృశ్యం

గాలివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఓ వృద్ధుడు హల్‌చల్ చేశాడు. రెవెన్యూ అధికారులు తమకు ఇవ్వాల్సిన ఎండార్స్‌మెంటు ఇవ్వలేదని కార్యాలయం ఎదుటే నిరసనకు దిగారు. ఆయన వివరాల మేరకు.. గాలివీడు పంచాయతీ పెద్దూరుకు చెందిన అబ్దుల్ ఖాదర్‌కు అదే పంచాయతీలోని సర్వే నెంబరు 497లో రెండు ఎకరాల యాభై సెంట్లు తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిందన్నారు. 1952లో భాగపరిష్కారాలు చేసుకోవడంలో భాగంగా తమకు ఈ భూమి వారసత్వంగా వచ్చిందని, సదరు భూమిపై తమ సమీప బంధువులకు ఎండార్స్‌మెంటు ఇచ్చారని ఆరోపించాడు. తన భూమిలో ఎవరికో ఎలా ఇస్తారని రెవెన్యూ అధికారులను నిలదీశాడు. తమ భూమికి సంబంధించి ఎండార్స్‌మెంటు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తెలిపారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. ఒకే భూమికి సంబంధించి ఇరువురి మధ్య జాయింట్ కలెక్టరు కోర్టులో విచారణలో ఉన్నదని, కానీ ఈ భూమికి సంబంధించి ఎండార్స్‌మెంటు ఇవ్వాలని తమను వారు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తహసీల్దారు భాగ్యలత పేర్కొన్నారు.

## చెరువు పనిని పరిశీలించిన పీడీ

చిన్నమండెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలోని సుద్దలగుట్టపల్లి వద్ద చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను, పనులను ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి బిల్లులు, మస్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లకు పనిదినాలు, పని కల్పించడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో మాధవి, ఈసీ సూర్య ప్రకాశ్‌రెడ్డి, టీఏ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పందెంరాయుళ్లు అరెస్ట్

సుండుపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కోడి పందెం ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ కొత్తకుంట హరిజనవాడ సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ఇద్దరు వ్యక్తులు, రెండు కోడిపుంజులు పట్టుకొని వారి వద్ద నుంచి రూ.2,360 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పల్లెలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనగలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దామనచర్ల ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు కోత ఉంటుందని విద్యుత్ ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. ఉప్పరపల్లె, బీఎం పురం, వెలగచర్ల, హరిజనవాడ, అరుంధతి వాడ, దామనచర్ల, గట్టువారిపల్లె గ్రామాల పరిధిలో అంతరాయం ఉంటుందన్నారు.

## రాచపల్లెలో కార్తీక మాసోత్సవాలు

రాజంపేటటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో మందరం రాచపల్లెలో గురువారం కార్తీక మాసోత్సవాలను నిర్వహించారు. టీటీడీ మనగుడి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 నుంచి 17వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం ధార్మిక ఉపన్యాసాలు, భజన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మందరం రాచపల్లె ఉమా మహేశ్వరాలయ కమిటీ ప్రతినిధి సంపత్ క్రిష్ణయ్య, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ఆధ్యాత్మిక ప్రవచకులు కొత్త నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధార్మిక కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు.

## ఉరుసు ఉత్సవానికి ఆహ్వానం



శ్రీనివాసరాజును ఆహ్వానిస్తున్న దృశ్యం

నందలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో కులమతాలకతీతంగా నిర్వహించే మగ్దూంబాబా ఉరుసు మహోత్సవంలో పాల్గొనాలని చిన్న పీఠాధిపతి సయ్యద్ హైదర్‌హుస్సేని రాజంపేట పార్లమెంట్ జనసేనపార్టీ సమన్వయకర్త శ్రీనివాసరాజును కోరారు. ఈ మేరకు రాజంపేట పార్టీ కార్యాలయంలో గురువారం ఉరుసు నిర్వాహకులు కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మన్నూరు నారాయణ, టీడీపీ నాయకులు షేక్ మౌల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు

● సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నవంబరు 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. నవంబరు 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని సీపీఎం నేతలతో కలిసి ప్రజాపోరు ప్రచార గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, వంట నూనెలు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామచంద్ర, నాగరాజు, రమణయ్య, మునెప్ప పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

రామాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీకి చెందిన సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయం రామాపురం మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి, ఉత్తమ మహిళా రైతు శ్రీదేవి, రాజగోపాల్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, పద్మజ, సుజాతరెడ్డి, హుస్సేనమ్మ, 30 మంది అంగన్వాడీ వర్కర్లు, రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రామాపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఇటీవల జరిగిన రీసర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ కృపావతి అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామంలో రీసర్వేలో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, వీఆర్వో, స్థానిక నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గురి పెడితే.. పతకమే...

● మెరిసిన ప్రొద్దుటూరు ఆణిముత్యం ● రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్న మహమ్మద్ ఉబైద్

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కఠోర దీక్ష.. పట్టుదల... ఏకాగ్రత... అలుపెరుగని సాధన... లక్ష్యంపై గురి ఇలా అన్ని లక్షణాలు అందిపుచ్చుకుని బరిలో దిగితే పతకాల పంటే. ఒకపక్క చదువు, మరోపక్క ఎంచుకున్న క్రీడపై ఆసక్తి పెంచుకుంటున్నాడు. రైఫిల్ షూటింగ్ క్రీడలో ప్రావీణ్యం పొంది మూడేళ్లలో తొమ్మిది స్వర్ణపతకాలు సాధించి ఆణిముత్యంలా నిలిచాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నాడు. పిల్లల ఆసక్తి బాల్యంలో గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని నిరూపిస్తున్నాడు షేక్ మహమ్మద్ ఉబైద్.

### కుటుంబ నేపథ్యం

ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని రాజరాజేశ్వరి కాలనీకి చెందిన షేక్ జాకీర్, అఫ్సానాబాను దంపతులకు ఇద్దరు కుమారులు. ఇతను పెద్ద కుమారుడు. తల్లి గృహిణి. తండ్రి ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉబైద్ శ్రీ చైతన్య స్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు.



ఏపీ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ మేనేజర్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా ఒకేసారి అందుకున్న నాలుగు స్వర్ణాలు (ఫైల్)

### గురి పెట్టాడంటే...

2021 నుంచి జార్జిక్లబ్‌లో రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న ఉబైద్ 2022 సంవత్సరం రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓపెన్‌సైట్ కేటగిరీ సబ్‌యూత్, యూత్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు.

- 2022లో ఎస్‌జీఎఫ్‌ఐ తరపున రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-19 కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఢిల్లీలో జరిగే నేషనల్ మ్యాచ్‌కు సెలెక్టు అయ్యాడు.
- 2023 జూన్‌లో ఢిల్లీలో జరిగిన నేషనల్ కాంపిటీషన్‌లో పాల్గొన్నాడు.
- 2023లో ఎస్‌జీఎఫ్ తరపున రాజమండ్రిలో నిర్వహించిన స్టేట్‌లెవెల్ కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-19 కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. భోపాల్‌లో జరిగే మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.
- 2023 డిసెంబరులో భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.
- 2024 ఆగస్టు నెలలో రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున హైదరాబాదులో నిర్వహించిన స్టేట్‌లెవెల్ పోటీల్లో ఓపెన్‌సైట్ కేటగిరీలో సబ్‌యూత్, యూత్, జూనియర్ మెన్, మెన్ కేటగిరిరీలలో నాలుగు బంగారు పతకాలు సాధించాడు.
- 2024 అక్టోబరులో ఎస్‌జీఎఫ్‌ఐ తరపున రాజమండ్రిలో నిర్వహించిన స్టేట్‌లెవెల్ కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-17 కేటగిరీలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.



సాధించిన పతకాలు.. తండ్రి షేక్ జాకీర్‌తో ఉబైద్

### దేశం తరపున ఆడాలన్నదే లక్ష్యం



జీవితకాలంలో ఒక్కసారైనా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలన్నదే నా ఆశయం. ఒలింపిక్స్‌లో ఆడాలనే తపన నాలో కసిని పెంచుతున్నది. దేశానికి పేరుకు తీసుకురావాలన్నది నా కోరిక. ఈ ఏడాది డిసెంబరు 25 నుంచి భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. నేను ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాను. ప్రతి రోజూ ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు రైఫిల్ షూటింగ్ సాధన చేస్తాను. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు కావడంతో ప్రస్తుతం రోజుకు రెండు గంటల సమయం కేటాయిస్తున్నాను. పదవ తరగతి తర్వాత విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉన్న విశ్వశాంతి జూనియర్ కళాశాలలో చేర్పించాలని మా నాన్న నా ఆశయ సాధనకు సహకరిస్తున్నారు. అందుకు కారణం ఆ కళాశాలలో రైఫిల్ షూటింగ్ ఉండడమే. కోచ్ రామవేంద్ర శిక్షణతో క్రీడల్లో ఆరంగేట్రం చేశాను. 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో పాల్గొని తొమ్మిది స్వర్ణ పతకాలు సాధించాను.

**- షేక్ మహమ్మద్ ఉబైద్, రైఫిల్ షూటర్**

## తాళ్ళపాక ఇండస్ట్రియల్ భూములపై
# ఏపీఐఐసీకి అధికారాలు బదలాయింపు

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం మదనగోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 46.16 ఎకరాల పారిశ్రామిక భూముల అజమాయిషీని గ్రామ పంచాయతీ నుంచి ఏపీఐఐసీకి బదలాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పారిశ్రామిక అవసరాల కోసం తాళ్లపాక గ్రామానికి చెందిన 46.16 భూములు సిద్ధమయ్యాయి. ఇవి మదనగోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఈ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమల స్థాపన కోసం పనులు ప్రారంభించేందుకు కొన్ని గ్రామ పంచాయతీలకు ఉన్న అధికారాలను పారిశ్రామిక సంస్థ (ఏపీఐఐసీ)కు బదలాయించాల్సి ఉంది. తాళ్లపాక రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 1270/1, 1273, 1279, 1280, 1281, 1282లోని మొత్తం 46.16 ఎకరాల ప్రభుత్వ భూములు ఏపీఐఐసీకి పరిశ్రమల స్థాపన కోసం సిద్ధం చేశారు. అయితే పంచాయతీరాజ్ చట్టం మేరకు ఈ భూముల అజమాయిషీ వ్యవహారాలు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. పరిశ్రమల కోసం భూములను అభివృద్ధి చేసి, పరిశ్రమలు ప్రారంభించిన తరువాత వచ్చే ఆదాయాన్ని మదనగోపాలపురం గ్రామ పంచాయతీ, ఏపీఐఐసీలు 50:50 దామాషాతో పంచుకునే షరతుతో ఈ భూములపై ఉన్న పంచాయతీ అధికారాలను ఏపీఐఐసీకి బదలాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ గ్రామ పంచాయతీ కూడా గతంలో తీర్మానం చేసింది. దీంతో పంచాయతీలకున్న అధికారాలను ఏపీఐఐసీకి బదలాయిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

రాయచోటిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా నుంచి రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగం నుంచి రెడ్డిబాలాజీ, సాయి, జస్వంత్, బాలికల విభాగం నుంచి నాగతేజ, వేణుమాధవి, చైతన్యశ్రీ పాల్గొనగా వారిలో జాతీయ స్థాయి జట్టుకు సాయి, చైతన్యశ్రీలు రెండు విభాగాల్లో ఎన్నికైనట్లు జిల్లా హాకీ అకాడమీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా హాకీ కోచ్ చంద్ర, రాజు స్కూల్స్ హెడ్‌మాస్టర్ ఉమామహేశ్వరి తెలిపారు. వీరు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆడనున్నారు. వీరితో పాటు అండర్-14, అండర్-19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల్లో శ్రీనిధి, చైత్ర, బాలుర విభాగంలో హర్ష, వర్మ, జగన్, శాసక్, వెంకటేశ్, నందినిలు వైజాగ్, కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాజు హాకీ అకాడమీ నుంచి 14 మంది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఆడుతున్నట్లు తెలియజేశారు.

# యువకుడు ఆత్మహత్య

నందలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తపి గ్రామంలో నువ్వుల సతీష్ (25) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. మంగళవారం ఇంట్లోకి వెళ్లిన యువకుడు రెండు రోజులుగా బయటకు రాలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. వారు ఇంటికి వెళ్లి చూడగా సతీష్ ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

కాగా తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని మృతుడు సూసైడ్ నోట్‌లో రాశాడు. మృతుడి తల్లిదండ్రులు జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దీపం సిలిండర్

● **జేసీ ఆదర్శ్ రాజేంద్రన్**



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దీపం-2 పథకం ద్వారా ఉచిత సిలిండర్ రాయితీ లభిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 1వ తేదీ నుంచి దీపం-2 పథకం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో శాసనసభ సభ్యులందరూ, ప్రజాప్రతినిధుల ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించారని, దీపం-2 పథకానికి జిల్లా వ్యాప్తంగా మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 33 వేలకు పైగా సిలిండర్లు బుక్ చేసుకున్నారని అందులో దాదాపు 21 వేల సిలిండర్లు డెలివరీ కూడా చేశారన్నారు. సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ రావడం లేదని కొంతమంది నుంచి ఫిర్యాదు అందుతోందని, ఎవరికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే 1967 నెంబర్‌కు ఫోన్ చేసి ఎల్పీజీ నెంబర్ లేదా ఫోన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్, రైస్‌కార్డు నెంబర్ తెలపవచ్చన్నారు. లేదా సచివాలయాల్లో పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● **కలెక్టర్ చామకూరి శ్రీధర్**



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంబేపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వేగవంతంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించి సూచనలు, సలహాలు చేశారు. ఆపార్‌ఐడీ ప్రగతిపై సమీక్షించారు. వీఆర్వో, పంచాయతీ సెక్రటరీలు ప్రతి పాఠశాలను సందర్శించి, బర్త్ సర్టిఫికెట్లు లేనివారిని నో అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇచ్చి బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని, అనంతరం విద్యార్థుల ఆధార్ అప్డేషన్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి లేఅవుట్ వారీగా దశలవారీ ప్రగతిపై మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష చేశారు. మంజూరైన ప్రతి ఇంటిని మూడు రోజుల్లోపు జియో ట్యాగ్ చేయాలని తెలిపారు. అనంతరం సంబేపల్లె అంగన్వాడీ ప్రీ స్కూల్‌ను తనిఖీ చేశారు. అంగన్వాడీ స్కూల్‌ను మరింత మెరుగ్గా నిర్వహించాలని టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్‌లను ఆదేశించారు. సంబేపల్లె ప్రకాశ్‌నగర్ కాలనీలో ఒకే పట్టాను ఇరువురు వ్యక్తులకు ఇచ్చిన అంశంలో స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి రికార్డులను, స్థలాన్ని పరిశీలించారు. స్థలానికి పక్కాగా కొలతలు వేసి అందజేయాలని, మరొక వ్యక్తికి అర్హతను బట్టి వేరే ప్రాంతంలో ఇంటి పట్టా మంజూరుకు సిఫారసు చేయాలని అధికారులను ఆదేశించారు.

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో హైవే నుంచి కేజీబీవీ స్కూల్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల వరకు 287 మీటర్ల మేర నిర్మించిన సీసీ రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల నిర్మాణం నాణ్యతలో ఎక్కడ రాజీపడరాదని అధికారులకు సూచించారు. పనులన్నీ డిసెంబరులోగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, డీపీవో బలరామిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో రామచంద్ర, ఎంఈవోలు, హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 837 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపైనే సూర్యుని వేడిని విద్యుత్‌గా మార్చుకోవడం వల్ల ఆర్థికంగా కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, నెడ్ క్యాప్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్లారెడ్డి, ఎల్‌డీయం ఆంజనేయులు, కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్ బారతి, మల్లూరు పంచాయతీ సర్పంచ్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

# ఆర్‌అండ్‌బీ రిటైర్డు ఈఈపై విచారణ

● అనంతపురానికి చెందిన ఇంజనీర్లపై కూడా
● విజిలెన్స్ విచారణలో వెలుగులోకి పలు అక్రమాలు
● ఏడాదికి పైగా చర్యలు లేకుండా వెనకేసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో కడప ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పని చేసి రిటైర్ అయిన పి.రవీంద్రబాబుపై విచారణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవీంద్రబాబుతో పాటు అదే సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేసిన మరో 8 మంది ఇంజనీర్లపై కూడా ప్రభుత్వం బుధవారం విచారణకు ఆదేశించింది. ఆ జిల్లాలోని పెనుగొండ-ముదిగుబ్బ-దొరిగల్లు మధ్య 28వ కి.మీ నుంచి 68వ కిలోమీటరు వరకు జరిగిన రోడ్డు విస్తరణ పనుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం రిటైర్ అయిన కడప ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రబాబుతో పాటు ఆ రోడ్డు పనులు పర్యవేక్షించిన మరో ఎనిమిది మంది ఇంజనీర్లు వివిధ రకాల అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ తేల్చింది. రవీంద్రబాబుతో సహా ఈ రహదారి విస్తరణ పనులను పర్యవేక్షించిన ప్రస్తుతం బద్వేలు డీఈఈగా పనిచేస్తున్న బి.ఎస్.సలీమ్, అనంతపురం డీఈఈగా ఉన్న ఎస్.బాల కాటమయ్య, కల్యాణదుర్గం ఈఈ వి.రాజగోపాల్, కల్యాణదుర్గం డీఈఈ జి.వెంకటసుబ్బయ్య, పెనుగొండ ఏఈఈ ఎ.వెంకటేష్, విజయవాడ ఎయిర్‌పోర్ట్ అథారిటీ డీఈఈ డి.పద్మజ, ధర్మవరం ఏఈ ఆర్.రవీంద్ర, విజయవాడ ఎన్‌హెచ్ ఈఈ జి.సంజీవరాయుడులపై విజిలెన్స్ అధికారులు పలు అభియోగాలను నమోదు చేశారు. వీరంతా కుమ్మక్కై రహదారి పనుల్లో అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డట్టు నిర్ధారించింది. ఈ తొమ్మిది మంది ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ 2023 మార్చి 20వ తేదీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే అప్పటి ప్రభుత్వం విజిలెన్స్ సిఫారసులకు సంబంధించిన నివేదికపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా పక్కన పెట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ నివేదికను వెలికితీసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొనేందుకు విచారణకు ఆదేశించింది. ప్రాథమికంగా విజిలెన్స్ గుర్తించి ప్రస్తావించిన వైఫల్యాలపై తగిన వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీరు సంజాయిషీలు పంపుకోవడానికి 10 రోజుల గడువిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే వేర్వేరుగా పది జీవోలను బుధవారం విడుదల చేశారు. కడప ఈఈ రవీంద్రబాబు రిటైర్ అయినందున పెన్షన్ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని మరో జీవోలో ఆదేశించారు.

# మహిళ మృతిపై ఉన్నతాధికారుల విచారణ



మృతురాలి కుమారుడిని విచారిస్తున్న అధికారులు

పీలేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో గత నెల 30వ తేదీ మహిళ మరణించిన ఉదంతంపై జిల్లా రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గురువారం విచారణ చేశారు. కేవీపల్లె మండలం గోరంట్లపల్లెకు చెందిన సి.కృష్ణమ్మ (55) ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో మరణించడం, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందన్న వామపక్ష సంఘాల ఆరోపణలు, ఫిర్యాదులతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రి వైద్యులు, రాయచోటిలోని ఏరియా ఆసుపత్రి వైద్యులతో విచారణ బృందాన్ని నియమించారు. విచారణ బృందం గురువారం ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో విచారణ జరిపింది. మృతురాలి కుమారుడు నాగేశ్వర, ఆమెకు వైద్యం అందించిన డాక్టర్ వసీంలను విచారించారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఐసీయూ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహించామని, విచారణ సారాంశాన్ని నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

# ఏపీఎస్‌బీసీఎల్‌లో పాత వస్తువుల విక్రయం



వేలం వేస్తున్న డిపో మేనేజర్, అధికారులు

మదనపల్లె టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపో పరిధిలోని 69 ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న పాత వస్తువుల విక్రయం ద్వారా రూ2 లక్షల ఆదాయం వచ్చిందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం పుంగనూరు రోడ్డులోని డిపోలో పాత ఫ్రీజర్లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్‌చెస్ట్, స్కానర్లను బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 27 మంది రూ.5 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వీటిలో 44 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 21 క్యాష్ చెస్ట్‌లను వేలంలో పలువురు పాడుకున్నారు. దీంతో రూ.2,02,635 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని ఏపీఎస్‌బీసీఎల్ ఖాతాకు జమ చేస్తామని డిపో మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. మిగిలిపోయిన ఫ్రీజర్లు, బ్యాటరీ ఇన్వర్టర్ల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి ఆదేశాలతో తిరిగి వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు, సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్, స్టోర్ ఆఫీసర్ నరేంద్ర పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిక

● **ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

కురబలకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదికను మండల రెవెన్యూ అధికారులు అందజేశారు. మండలంలోని అమ్మచెరువు మిట్ట వద్ద తెట్టు, అంగళ్లు రెవెన్యూ పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో 'దర్జాగా అమ్మేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది.

దీనిపై జిల్లా అధికారులు స్పందించి దీనికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

# సర్టిఫికెట్ కరెక్షన్‌కు డబ్బుల వసూళ్లు

● ఒక్క పనికి రూ.350 నుంచి రూ.750 ● మున్సిపల్, సచివాలయాల్లో ఇదీ పరిస్థితి

మదనపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో బర్త్ సర్టిఫికెట్‌లో కరెక్షన్ కోసం మున్సిపల్, పంచాయతీ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. వీరు పడే ఇబ్బందులు ఒక ఎత్తయితే, అందుకయ్యే ఖర్చు కూడా తడిసిమోపెడవుతోంది. ఇందుకోసం మదనపల్లె మున్సిపల్ కేంద్రానికి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో క్యాష్‌కౌంటర్ ముందు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రద్దీగా ఉంటోంది. అలాగే రెండు వార్డు సచివాలయాలు కూడా ఇదే తరహాలో కిక్కిరిసిపోతున్నాయి. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు మున్సిపల్, సచివాలయ సిబ్బంది వసూళ్ల పర్వానికి తెరలేపారు. దరఖాస్తు నింపడం నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, ఆమోదం వరకూ బాధితులకు చేతి చమురు వదిలిపోతోంది. సాధారణంగా జనన ధ్రువీకరణ పత్రంలో ఏదైనా కరెక్షన్ చేయాలంటే రూ.100 చలానా రూపంలో మున్సిపాలిటీకి చెల్లిస్తే అక్కడ మనకు కావాల్సిన సేవలు పొందవచ్చు. కానీ అపార్ ఐడీతో రద్దీ పెరగడంతో వీరు ఫీజు కూడా భారీగా పెంచేసినట్లు చెబుతున్నారు. రూ.వందతో పోయే పనికి రూ.350 నుంచి రూ.750 వరకు ఖర్చు అవుతోందని బాధితులు వాపోతున్నారు. మొదటగా తమకు కావాల్సిన కరెక్షన్‌ను దరఖాస్తులో పూరించి సచివాలయంలో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నప్పుడు ఇన్షియల్‌తో ఉండగా తాజాగా విద్యాసంస్థలు సర్‌నేమ్‌తో సర్టిఫికెట్ అడుగుతున్నారు. ఈ క్రమంలో సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకెళితే కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు.

వీటిని మున్సిపల్ కార్యాలయం నుంచి త్యాగరాజు, కోటగడ్డ, చంద్రవిలాస్, కృష్ణానగర్ సచివాలయాలకు పంపుతున్నారు. అక్కడ అప్‌లోడ్ చేయగానే, మున్సిపల్ కార్యాలయంలో అప్రూవల్ ఇస్తే, తమకు కావాల్సిన ప్రింట్ అవుట్ తీసుకోవచ్చు. ఈ ప్రక్రియ వారం, పది రోజులు పడుతుందని చెబుతుండగా అవసరం మేరకు సొమ్ములు తీసుకుని ఇచ్చేస్తున్నారు. సర్టిఫికెట్‌లో ఒకటి కంటే ఎక్కువ కరెక్షన్ ఉంటే, ఒక్కోదానికి రూ.350 నుంచి రూ.1000 తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇలా వంద రూపాయలతో పోయే పనిని రూ.350 నుంచి రూ.750, ఆపై వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఎక్కువ డబ్బులు వసూలు చేసినట్లు ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. ఒక్కో కరెక్షన్‌కు రూ.100 అది కూడా మున్సిపాలిటీలో చలానా రూపంలో చెల్లించాలి. అంతకుమించి వసూలు చేస్తే క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

**- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె**





మున్సిపల్ కార్యాలయంలో క్యూకట్టిన జనాలు - చంద్రవిలాస్ సచివాలయంలో కరెక్షన్ కోసం ప్రజల రద్దీ

# వేంపల్లెకు వస్తే ట్రాక్టర్లతో తొక్కిస్తాం

● పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లకు ఓ నేత హుకుం

పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ట్రాక్టర్లు వేంపల్లె వద్దనున్న పాపాఘ్ని ఇసుకకు రాకూడదని, వస్తే ట్రాక్టర్లతో తొక్కిస్తామని ఓ నాయకుడు బెదిరింపులకు దిగారు. కొన్నిరోజులుగా పాపాఘ్ని నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను పులివెందులకు చెందిన కొంతమంది తరలిస్తున్నారు. కానీ గురువారం వేంపల్లెకు చెందిన ఓ నాయకుడు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్లు మళ్లీ ఇసుకకు వస్తే ట్రాక్టర్లతోనే తొక్కిస్తామని వారిని బెదిరించారు. అప్పటికే ట్రాక్టర్లలో నింపిన ఇసుకను అన్‌లోడ్ చేయించి వెనక్కు పంపారు. వేంపల్లెకు చెందిన ట్రాక్టర్లు కూడా ఇసుక తీసుకెళ్లాలంటే రూ.100 గేటు, కూలీలు రూ.500 చెల్లించాలని చెప్పారు. దీంతో గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో పలువురు డ్రైవర్లు పులివెందులలోని కడపరోడ్డులో ట్రాక్టర్లను నిలిపి ఆందోళన చేశారు. ఇదే సమయంలో వేంపల్లెకు చెందిన ట్రాక్టర్లు ఇసుకతో రావడంతో వాటిని పులివెందులలోకి వెళ్లనివ్వకుండా ఆపేశారు. తమను వేంపల్లెకు రానివ్వనప్పుడు.. వేంపల్లె ట్రాక్టర్లు పులివెందులలోకి ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. అనంతరం 12గంటల ప్రాంతంలో వేంపల్లెకు చెందిన ఇసుక ట్రాక్టర్లను వెనక్కి తిప్పి పంపారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో సమస్య పరిష్కరించుకుంటామని పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపారు.

పులివెందుల వాసులు ఇసుక తెచ్చుకోవాలంటే ఇటు పాపాఘ్నికి గాని, అటు చిత్రావతికి గాని వెళ్లాల్సి ఉంటుంది. చిత్రావతికి వెళ్లాలంటే చాలా దూరం. దీంతో పాపాఘ్నికే వెళుతుంటారు. అయితే అక్కడి నాయకులు వీరిని అడ్డుకోవడం వివాదానికి కారణం అవుతోంది.

ఆందోళనకు దిగిన పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లు





పులివెందులలో నిలిపివేసిన వేంపల్లె ఇసుక ట్రాక్టర్లు

## టెక్స్‌టైల్‌పార్కు, జలాశయాల పరిశీలన



సోలార్‌ప్లాంట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆది

మైలవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టెక్స్‌టైల్ పార్కును, మైలవరం జలాశయాన్ని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురువారం పరిశీలించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీతో కలిసి టెక్స్‌టైల్ పార్కును పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. చేనేత సంఘ నేతలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే టెక్స్‌టైల్ పార్కును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మైలవరం జలాశయాన్ని పరిశీలించి నీటి నిల్వపై ఆరా తీశారు. పొన్నం పల్లి వద్దనున్న సోలార్ ప్లాంట్‌ను పరిశీలించి.. పవర్ ప్రాజెక్ట్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సోలార్, జలాశయ, టెక్స్‌టైల్ పార్కు అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

వేముల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో మండల మహిళా సమాఖ్యలో గ్రామ సమాఖ్య అసిసెంట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తులు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ విధానంలోకి తీసుకురావాలన్నారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుదలకు బ్యాంకుల ద్వారా నారిశక్తి రుణాలను, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ సబ్సిడీరుణాలను అనుసంధానం చేయలని ఆదేశించారు. వెలుగు ఏపీఎం ఆంజనేయులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు జ్యోతి, జైపాల్, హరికృష్ణ, నాగేశ్వరి, గంగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

## అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు



బాలుర విభాగంలో ఛాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కడప జట్టు క్రీడాకారుడు

ఉంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల,బాలికల అథెటిక్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. రెండురోజుల పాటు జరిగిన ఈ పోటీలు కైకరం, నారాయణ పురం చింతలపాటి బాపిరాజు స్టేడియంలో జరిగాయి. బాలికల ఛాంపియన్‌గా అనంత పురం జిల్లా, బాలుర ఛాంపియన్‌గా కడప జిల్లా జట్లు విజయం సాధించాయి. పోటీల రాష్ట్ర పరిశీలకుడు ప్రసాదరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.అలివేలు, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు గుళ్ల ప్రసాదరావు వారికి బహుమతులు అందజేశారు.

## ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ పోటీలు

పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ క్రీడాప్రాంగణంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న సాఫ్ట్ టెన్నిస్ బాలుర విభాగం క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర విజేతలుగా కడప, అండర్ 17 విభాగంలో కడప, చిత్తూరు అండర్ 19 విభాగంలో గుంటూరు క్రీడాకారులు విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డీవీ కొండారెడ్డి, విశిష్టఅతిథి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు ప్రసంగించారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య భర్త మృతి



జానా శివప్రసాద్, శైలజ మృతదేహాలు

వల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని వల్లూరు మండల కేంద్రానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కడపకు చెందిన జానా శివప్రసాద్ (40) అతని భార్య శైలజ (35) ఇరువురూ ద్విచక్ర వాహనంలో కమలాపురం మండలం చదిపిరాళ్లకు వెళ్లి... తిరిగి కడపకు వస్తుండగా వల్లూరుకు సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు రాగానే కడప నుంచి కమలాపురం వెళుతున్న లారీ (కంటైనర్) ఢీకొన్న సంఘటనలో శైలజ సంఘటనాస్థలిలో మృతి చెందింది. కొన ఊపిరితో ఉన్న భర్త శివప్రసాద్‌ను 108లో కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. జానా శివప్రసాద్ సిద్దవటంలో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా... భార్య ఇంటి వద్ద గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు విఘ్నేశ్ (8), లక్ష్మి (12) ఉన్నారని పోలీసులు తెలిపారు .ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

## నిప్పంటించుకుని మహిళ మృతి



పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న యాదవ్‌గుంట రాజేశ్వరి (48) గురువారం నిప్పంటించుకుని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. పులివెందులకు చెందిన సదాశివారెడ్డితో ఆమెకు 30 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత పదేళ్ల నుంచి మానసికంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిప్పంటిచుకుంది. భర్త ఇంటికి వచ్చి చూడగా.. మంటలు వస్తుండడంతో అక్కడికి వెళ్లి మంటలు అదుపు చేశారు. చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సలు చేసి అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు రెఫర్ చేయడంతో వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## చీటీలపేరుతో మోసం కేసులో...
## ఇరువురికి జైలుశిక్ష, జరిమానా

● శిక్షపడిన వారిలో మాజీ హోంగార్డు

కడప (క్రైం)నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ చీటీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేసి తిరిగి వారికి ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఇరువురికి నాలుగేళ్ల జైలు శిక్ష రూ.22వేలు జరిమానా విధిస్తూ సెషన్స్ జడ్జి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప రాజారెడ్డి వీధికి చెందిన రెడ్డి నాగులు అతడి భార్య లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి ప్రైవేట్ చీటీల వ్యాపారాలు చేస్తూ పలువురి నుంచి డబ్బులు తీసుకొని తిరిగి వారికి ఇవ్వకుండా మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మాజీ హోంగార్డు రెడ్డి నాగులు, అతడి భార్య లక్ష్మీదేవితో పాటు పాలెం శారద, వెంకట సుబ్బరాయుడు అలియాస్ సంజీవరాయుడు, రెడ్డిశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసు విచారణలో భాగంగా గురువారం రెడ్డినాగులు, లక్ష్మీదేవిలపై నేరం రుజువు కావడంతో జడ్జి ఇరువురికి నాలుగేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.11వేలు చొప్పున 22వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ముగ్గురిపై కేసును కొట్టేశారని తెలిపారు. ఈ కేసును పీపీ బాలజీ వాదించినట్లు తెలిపారు.

## చీటింగ్ కేసులో భార్యభర్తలకు ఏడేళ్లు జైలు

కడప(క్రైం)నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్స్ నడుపుతూ 33 మంది నుంచి రూ.31 లక్షలు వసూళ్లు చేసి మోసం చేసిన భార్యభర్తలకు ఏడు సంవత్సరాల జైలుశిక్ష, 22వేలు జరిమానా విధిస్తు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప బాలజీనగర్‌కు చెందిన మల్లికార్జునరెడ్డి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న భార్య హరితమ్మతో కలిసి 2019లో ప్రైవేట్ చీటీలు నిర్వహించారు. 33 మంది నుంచి రూ.31లక్షలు వసూళ్లు చేసి తిరిగి చీటీలు వేసిన వారికి చెల్లించకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు 2019లో భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి విచారించిన జడ్జి వారిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు ఇద్దరికి కలిపి రూ.22 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసును పీపీ బాలాజీ వాదించినట్లు తెలిపారు.

## చిట్స్ పేరుతో మోసం చేసిన వ్యక్తికి..

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిట్స్ పేరుతో 92 మందిని మోసం చేసిన కేసులో ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన వై.శ్రీనివాసులరెడ్డికి ఏడేళ్ల జైలుశిక్ష రూ.18వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన వై.శ్రీనివాసులరెడ్డి చిట్స్ నడుపుతూ మోసం చేయడంతో 92 మంది బాధితులు అతనిపై ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు విచారణలో నిందితుడికి శిక్ష విధించినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

## భారీగా పట్టుబడ్డ రేషన్ బియ్యం అక్రమ నిల్వలు

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండిబజార్ రోడ్డులోని వాసవీ ట్రాన్స్‌పోర్టు సమీపంలో గదుల్లో రేషన్‌బియ్యం అక్రమ నిల్వలను సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి అక్రమ నిల్వలపై సమాచారం రావడంతో మండిబజార్‌లోని షాపింగ్‌కాంప్లెక్స్ గదులను పరిశీలించారు. ఈ గదుల యజమానులు ఎవరని విచారిస్తున్నారు. ఇందులో అక్రమ బియ్యం వున్నట్లు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లై డిటీ మల్లికార్జున, ఆర్ఐ సాయిప్రసాద్ రూరల్ ఎస్ఐ రఫీ పరిశీలించారు. రాత్రి పొద్దుపోవడంతో శుక్రవారం వీటిని సీజ్ చేయనున్నట్లు తెలిపారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● అభివృద్ధి ప్రణాళికలను జాగ్రత్తగా తయారు చేయాలి ● డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ




సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ

కడప రూరల్, అక్టోబర్ 7,(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ కోసం రెండురోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు సద్వినియోగం చేసుకుని.. 2025-26 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ (జడ్పీ సీఈవో) ఓబులమ్మ, వైస్ ప్రినిపాల్(డీపీవో) రాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన రెండో బ్యాచ్ జిల్లాస్థాయి టాట్స్ శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ)నిధులతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో జీపీడీపీ ప్రణాళిక తయారీపై శిక్షణ ఇవ్వడం జరు గుతుందన్నారు. ఈమేరకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో రెండో బ్యాచ్ శిక్షణను 7,8 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ పట్ల అశ్రద్ద వహించరాదన్నారు. ఈ శిక్షణ ద్వారా క్షేత్రస్థాయి వరకు సరైన అవగాహన లభిస్తేనే రాబోయే సంవత్సరం ప్రణాళిక సక్రమంగా తయారు చేయటం, అమలు చేయటం వీలుపడుతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల విషయంలో మనం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. ఇందుకోసం ఈశిక్షణా కార్యక్రమాన్ని ప్లాన్ తయారీ, అమలు, ఆడిట్‌ల ప్రాధాన్యతపరంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. శిక్షణను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థకు చెందిన అధికారులు అబ్జర్వర్లుగా హాజరై పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ శిక్షణలను ముఖ్యంగా గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలో 2025-26 సంవత్సరానికి తయారు చేయాల్సిన ప్రణాళికలను సమర్థవంతంగా తయారు చేసి తద్వారా పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధుల విడుదలలో సమస్యలు రాకుండా చూసుకునే విధంగా అవగాహన కోసం ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి కాగానే మండలస్థాయిలలో నవంబర్ 12 నుంచి 16 వరకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు, లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు శిక్షణ ఉంటుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని... తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. శిక్షణలో డీఎల్‌పీవోలు, డీపీఆర్సి కో-ఆర్డినేటర్ భాష్కర్, ఏవో బండపల్లి నాగభూషణం, సురేష్, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించిన శాప్ చైర్మన్



స్పోర్ట్స్ స్కూల్ వంటశాలలో పరిశీలిస్తున్న శాప్ చైర్మన్

కడప స్పోర్ట్స్ నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్‌లోని హాస్టల్‌ను గురువారం శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పరిశీలించారు. అక్కడి విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. బాలికల వసతి గదులు అధ్వానంగా ఉన్న సంగతిని గ్రహించారు. అందులో గల ఫ్యాన్లలో కొన్ని తిరగడం మానేసినట్లు గుర్తించారు. వెలగని లైట్స్ నిర్వహణకు నోచుకోని టాయిలెట్స్ గుర్తించి అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భోజనశాల పరిశీలించి వంటలను రుచి చూసి నాణ్యత లోపించడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్తీనూనె, ఆహార పదార్థాలను గుర్తించి ఆరా తీయగా సదరు కాంట్రాక్టర్ నాసిరకం పదార్థాలను పంపిణీ చేస్తున్నట్లు అక్కడి వంట సిబ్బంది బదులిచ్చారు. దీంతో అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీఎస్డీఓకు ఆదేశాలిచ్చారు.

## వైసీపీ నేతలపై హత్యాయత్నం కేసు

మైదుకూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరామకృష్ణ, నేట్లపల్లి రామాంజనేయులుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. గతంలో మైదుకూరు మండలం నంద్యాలపేట రెవెన్యూ పొలం సర్వే నెంబరు 1910లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును పాతుతుండగా వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం అతని సోదరుడు రామాంజనేయులు ఈ పొలం మాది అంటూ వారిని అడ్డుకున్నారు. అంతేకాకుండా వారిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఈ నెల 2వ తేదీన కేసు నమోదు కాగా గురువారం వారిని అరెస్ట్, చేసి కోర్టుకు హజరు పరిచినట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

## యువతి ఆత్మహత్యాయత్నం

కడప (క్రైం), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలోని మల్టీస్పెషాల్టి ఆసుపత్రిలో పనిచేస్తున్న యువతి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి అక్కడే పనిచేస్తున్న యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఇరువురి మధ్య ఏం జరిగిందో కానీ యువతి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. దీంతో యువతిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైనా వైద్యం కోసం వేలూరికి తరలించినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చోరీ కేసులో మహిళ అరెస్టు

కడప (క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నబీకోటలో గతనెలలో జరిగిన చోరీ కేసులో మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు నబీకోటకు చెందిన దేవి ఇంట్లో నిందితురాలు కవిత గతనెల వెళ్లి బీరువాలో ఉన్న రూ.లక్ష 20వేలు నగదును చోరీచేసినట్లు తెలిపారు. బాధితురాలు దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కవితను అరెస్టు చేసి.. ఆమె వద్ద నుంచి రూ.50వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## దివంగత ఎంపీ డీఎన్‌రెడ్డి సతీమణి మృతి



పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ దివంగత నేత, స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ డీఎన్‌రెడ్డి సతీమణి డి.లక్ష్మిదేవమ్మ (95) గురువారం మృతి చెందారు. హైదరాబాద్‌లో గత ఐదు నెలలుగా కుమారుడు రమణారెడ్డి వద్ద ఉండేవారు. కొద్దిరోజుల నుంచి అనారోగ్యం బాధపడుతూ గురువారం మృతి చెందారు.

## 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులు దాడులు చేపట్టారు. గురువారం కోనేటికాల్వ వీధి, శివాలయం వీధి, గాంధీరోడ్డు తదితర ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్ చేశారు. ఈప్లాస్టిక్ వస్తువులను మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చి కమిషనర్ ఎదుట వుంచారు. కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ 120 మైక్రాన్‌లకంటే మందం తక్కువగా వున్న ప్లాస్టిక్ కవర్లు నిషేదమన్నారు. వ్యాపారులు వీటిని విక్రయించడం నేరమన్నారు. ప్లాస్టిక్ విక్రయ దారులకు జరిమానా విధించామన్నారు. ఈదాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీత సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అరటి వ్యాపారి ఐపీ.. ఆందోళనలో రైతులు

● 30 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఎగవేత

లింగాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తుని నమ్మక ద్రోహనికి అరటటి రైతులు బలయ్యారు. సుమారు 30 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఎగ్గొట్టిన ఉదంతం ఇది. రైతుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. లింగాల ఎస్ఐ మధుసూదన్‌రావు, రైతుల కథనం మేరకు వివరాలిలా..

మండలంలోని వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ మల్లికార్జునరెడ్డి అరటి కాయల వ్యాపారం చేసేవాడు. సాధారణంగా అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించిన తర్వాత వారం పది రోజుల్లోగా రైతులకు డబ్బులు ఇచ్చేవారు. అలా సుమారు 30 మంది రైతులకు చెందిన అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకొని రైతులకు ఇవ్వకుండా వ్యాపారస్తుడు పరారయ్యాడు. రైతులకు చెందిన డబ్బులను మల్లికార్జునరెడ్డి తన కుమార్తె వసుప్రియ, అల్లుడు భవానిరెడ్డిలు నూతనంగా నిర్మించిన ఇంటికి ఉపయోగించారని, తమకు డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇటీవల సుమారు 20 మంది రైతులకు వ్యాపారస్తుడు మల్లికార్జునరెడ్డి ఐపి నోటీసులు పంపడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో లింగాలకు చెందిన రైతు ముచ్చుమర్రి చంద్రోఖర్‌రెడ్డి తనకు రూ.8.25లక్షలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మల్లికార్జునరెడ్డి, అల్లుడు, కుమార్తె భవానీరెడ్డి, వసుప్రియలపై ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మధుసూదన్‌రావు వారిపై కేసు నమోదు చేశారు.

# మురుగు ఇలా.. పరిశుభ్రత ఎలా..?

- గామాల్లో లోపించిన పారిశుధ్యం
- కనిపించని స్వచ్ఛతహీ సేవా
- పూడిపోయిన మురుగు కాలువలు
- దోమలు అధికమై జ్వరాల భారీన పడుతున్న ప్రజలు



చెత్తా చెదారంతో నిండినపులికల్లు గ్రామంలోని ప్రధాన కాలువ

పెద్దతిప్పసముద్రం నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే కార్యక్ర మాన్ని అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి ప్రారంభించి నా గ్రామాల్లో ఇంకా ప్రజలకు మురుగు కష్టాలు తప్పడంలేదు. ఆయా గ్రామాల్లో పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు మురుగునీటి కాలువలను శుభ్రం చేసి కాలువల్లో బ్లీచింగ్ చల్లాల్సి ఉంది అయితే స్వచ్ఛతా హే సేవా కార్యక్రమాలను తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో మురుగు కాలువల్లో ఉన్న చెత్తా చెదారం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు అధికమై ప్రజలు రోగాల భారీన పడుతున్నారు.

### ప్రధాన కాలువలు పూడుకుపోయాయి

మండలంలోని అనేక గ్రామాల్లో ఉన్న ప్రధాన మురుగు కాలువలు పూర్తిగా పూడుకు పోవడంతో మురుగు నిల్చి దోమలు అధికమై ప్రజలు జ్వరాల భారీన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రంగసముద్రం పంచాయతీ వినసక్రవాండ్లపల్లెలో ఉన్న ప్రధాన మురుగు కాలువైన ఇరిగేషన్ కట్టుకాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో కట్టుకాలువ పూర్తిగా కంపచెట్లతో మూసుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కాగా కట్టుకాలువ పక్కనే పంచాయతీ తాగునీటి బోరు ఉండడంతో కాలువలోని మురుగునీరు బోరులోకి కలుషితం అవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

### పీటీఎంలో కొరవడిన పారిశుధ్యం

మండల కేంద్రమైన పీటీఎంలోని పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో మురుగునీటి కాలువ పూర్తిగా పూడుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది మండల కేంద్రంలోనే పారిశుధ్యం ఇలా ఉంటే ఇక గ్రామీణా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ వైపు గ్రామాలను స్వచ్ఛ గ్రామాలను చేయాలనే ఉద్దేశ్యం ఇలా నీరు గారుతుంటే ప్రభుత్వ లక్ష్యం ఎప్పుడు నెరవేరుతుందని పలువురు వాపోతున్నారు.

### జ్వరాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండడంతో గ్రామాల్లోని మురుగు కాలువలు పూర్తిగా నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో దోమలు అధికంగా ఉండడంతో రంగసముద్రం పంచాయతీ వినసక్రవాండ్లపల్లెలో అనేక మంది జ్వరాల బారీన పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ కాలువపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### వేధిస్తున్న సిబ్బంది కొరత

ముఖ్యంగా పంచాయతీల్లోని సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. అన్ని పంచాయతీలకు పూర్తి స్థాయిలో లేక పోవడం నాలుగైదు పంచాయతీలకు ఒకే కార్యదర్శి ఉండడంతో పంచాయతీ సమస్యలపై కార్యదర్శులు దృష్టి సారించేందుకు వీలు లేకుండా పోయిందని, పంచాయతీ కార్యదర్శులను పూర్తి స్థాయిలో నియమించి ఆయా పంచాయతీల్లో పారిశుధ్యంపై దృష్టిని కేంద్రీకరించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి కార్యదర్శులను నియమిస్తే పంచాయతీలలో పారిశుధ్య సమస్యలు నివారించవచ్చని పలువురు పేర్కొంటున్నారు.



వినసక్రవాండ్లపల్లెలో కట్టుకాలువ పూర్తిగా పూడిపోయిన దృశ్యం

## చికిత్స పొందుతూ యువతి మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు7: ఆత్మహత్యకు పాల్పడిన యువతి నగీనా(20) చికిత్స పొందుతూ తిరుపతిలో గురువారం మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణం, నక్కలదిన్నెకు చెందిన నగీనా కుటుంబసభ్యులు సెల్‌పోన్ కొనివ్వలేదని మనస్తాపం చెంది ఈ నెల 5వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది, ఆమెకు అమ్మభాను, చెల్లెలు ఉన్నారు. తండ్రిలేరు. మేనత్త తపస్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## వరి ధాన్యం చోరీపై ఫిర్యాదు

వాల్మీకిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం చోరీపై రైతు రామనారాయణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు కథనం మేరకు మండలంలోని విఠలం గ్రామానికి చెందిన తాను ఆరుగాలం శ్రమించిన వరి పంట కోత కోసి గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఆరబోయగా బుధవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు చొరబడి 30బస్తాల వరి ధాన్యం గుట్టుచప్పుడు కాకుండా అపహకరించుకు పోయారన్నారు. గురువారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నూర్ మహమ్మద్(30) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనాన్ని లగేజీ వాహనం ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శోత్రియం భూములను వెంటనే పంపిణీ చేయాలి



సమావేశమైన సీపీఐ నాయకులు

ములకలచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె సమీపంలో ఉన్న శోత్రియం భూములను పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు క్రిష్ణప్ప, మండల కార్యదర్శి అంజనప్పలు డిమాండ్ చేశారు. చెరువుకిందపల్లె సమీపంలో గురువారం భూ పోరాట సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1991 నుంచి శోత్రియం భూములు పేదలకు పంచాలని పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కులు వేమనారాన, నిజాం, చంద్ర, నరసింహులు, పాపులమ్మ, కదిరమ్మ, గంగులమ్మ, శివమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై ప్రత్యేక క్యాంపెయిన్

నిమ్మనపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదుపై రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ కేంద్రం 200 నుంచి 223 వరకు ఉన్న కేంద్రాలలో శని, ఆదివారాలలో సంబంధిత బీఎల్‌వోలు ఓటరు లిస్టును పరిశీలించి 18ఏళ్లు నిండిన వారికి కొత్త ఫొటో ఓటర్ల నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే మరణించిన, గ్రామాలు విడచిన, డబుల్ ఎంట్రీ వంటి వాటిపై డిలీషన్స్ కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. వాటితో పాటుగా ఫారం 6. 7, 8సి, 8ఎ‌ల గురించి బీఎల్‌వోలు వివరిస్తారని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 5గంటల మధ్య వారి బూత్‌లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఎవరైనా తాజా ఓటరు లిస్టును పరిశీలించుకోవాలన్నారు.

## కార్యకర్తల సంక్షేమానికే సభ్యత్వ నమోదు

వాల్మీకిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికే టీడీపీ సభ్యత్వ నమోదు చేయడం జరుగుతోందని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోసూరి చంద్రమౌళి, ఆరమడక సూరి, రాజారెడ్డి, నరసింహారెడ్డి, రాజగోపాల్, సతీష్, రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## బిక్కావాండ్లపల్లెలో రామాలయం ప్రారంభం

● నేడు విగ్రహప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం



బిక్కావాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయం పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి కమలానంద భారతీస్వామి

పెద్దమండ్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం బిక్కావాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని గురువారం వైభవంగా ప్రారంభించారు. టీటీడీ ఆర్థిక సాయం, స్థానికుల సహకారంతో సుమారు రూ.10లక్షల వ్యయంతో ఆలయం నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా గోపురంతోపాటు రామలక్ష్మణుల సమేత సీత, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. విజయవాడకు చెందిన భువనేశ్వరిపీఠం పీఠాధి పతి కమలానంద భారతీస్వామి ఆధ్వర్యం లో మూడురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ గణపతి హోమం, అగ్నిహోమం, నవగ్రహ పూజ, అస్త్రోత్తర కలసాభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం కమలానంద భారతీస్వామి ధార్మికోపన్యాసం చేశారు. అలాగే శుక్రవారం పూర్ణాహుతి, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, కలశస్థాపన, సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈవేడుకలను తిలకించడానికి బిక్కావాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, చెరువుకిందపల్లె, ఉప్పరపల్లె, పెద్దమండ్యం పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

## హుండీ ద్వారా రూ.ఆరులక్షలు ఆదాయం



ఆలయంలో హుండీ లెక్కింపు చేస్తున్న అధికారులు

మదనపల్లె అర్బన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలోని ప్రసన్నవెంకటరమణ స్వామి వారికి హుండీ ద్వారా రూ.6,00,563 ఆదాయం లభించింది. ఆలయంలో గురువారం హుండీ లెక్కింపులు నిర్వహించినట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. ఇందులో ఆదాయం గడిచిన మూడు నెలలకు రూ.6,00,563 వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ అధ్యక్షుడు బీజే పాండు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ క్రికెట్ జట్టుకు మిట్స్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి మౌర్య జేఎన్‌టీయూ క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరానికి చెందిన మౌర్య గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, పీడీ దామోదరన్ తదితరులు అభినందించారు.

## ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా గాయత్రిశ్రీ



మెడికల్ సూపరింటెండెంట్ రాజుకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ గాయత్రి శ్రీ నియమితులయ్యారు. ఇక్కడ మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ ఎంఎస్ రాజు బదిలీపై వెళ్తుండటంతో గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే మదనపల్లె మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ జమున బదిలీ కాగా ఆమె స్థానంలో డాక్టర్ శివరామకృష్ణ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. వీడ్కోలు కార్యక్రమంలో ఆర్ఎంవో ప్రసాదరాజు, పద్మాంజలిదేవి, తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత జ్ఞానాంబిక కళాశాల



బాస్కెట్‌బాల్ విజేతజట్టుతో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల యజమాన్యం

మదనపల్లె టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో నిర్వహించిన అంతర్ డిగ్రీ కళాశాలల క్రీడా పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన బాలికల జట్టు బాస్కెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచి రోలింగ్ షీల్డ్ సాధించింది. గురువారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి ఎస్వీయూ మైదానంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో తమ కళాశాలజట్టు ఫైనల్స్‌కు చేరి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై 18-12 గోల్స్ తేడాతో విజయం సాధించి ఈ యేడాది రోలింగ్ షీల్డు కైవసం చేసుకుందన్నారు. తమ కళాశాలలో విద్యతో పాటు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, పీడీ శరత్‌నాయక్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## దేవదాయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



దేవదాయ భూ ఆక్రమణపై గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ భూములను దురాక్రమణ చేస్తే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. మండలంలోని కురిజల గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయ భూమి వివాదాస్పదమైన విషయంపై గురువారం మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే గ్రామస్థులు, తహసీల్దార్, ఎస్ఐల సమక్షంలో విచారణ చేశారు. అలయానికి చెందిన 1.6ఎకరాల భూమిని కురిజల గ్రామస్థుడు చెంగారెడ్డి గత 30ఏళ్లుగా తన ఆధీనంలో ఉంచుకున్నట్లు గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దేవదాయ శాఖాధికారులు వెంటనే ఆలయ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. మండలంలోని ఆలయాలకు సంబంధించిన భూముల వివరాలు సేకరించి ఏవైనా దురాక్రమణ జరిగింటే వాటిపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నిర్మలాదేవికి సూచించారు. గ్రామాల్లో భూసమస్యలు ఉంటే శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకునేలా చూడాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీలు మునివెంకటస్వామి, శివశంకర్, మాజీ సర్పంచ్ శివప్ప, మండల మాలమహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, మండల వడ్డెర సంఘ అధ్యక్షుడు రెడ్డెప్ప, పలువురు కురిజల గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాడ్మింటన్ క్రీడాకారులకు దుస్తుల వితరణ



పీలేరు, నవంబరు 7(ఆంధ్ర జ్యోతి): నంద్యాలలో 8, 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ జట్టుకు పీలేరుకు చెందిన రాచూరి కిరణ్ దుస్తులు వితరణగా అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నాహకంగా గత వారం రోజులగా పీలేరులో క్రీడాకారులకు శిక్షణ నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్ దుస్తులు అందజేశారు. క్యాంపు నిర్వహణకు పీలేరుకు చెందిన సీనియర్ క్రీడాకారులు అంజు, నరేంద్ర, మనోజ్, చరణ్, రాహుల్ రెడ్డి ఆర్థిక సాయం అందించినట్లు క్యాంపు నిర్వాహకులు అవినాశ్ రెడ్డి తెలిపారు. క్రీడాకారులకు దుస్తులు అందించిన రాచూరి కిరణ్‌ను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు హరినాథ్ సన్మానించారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : సీఐ

వాల్మీకిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడం సరైనది కాదని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీలు, వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలన్నారు. ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఆదినారాయణ



ములకలచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఆదినారాయణ ఎన్నికయ్యారు. మదనపల్లెలో గురువారం జరిగిన జిల్లా మహాసభలో మండలం లోని దేవళచెరువు జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఆయన ఎన్నిక పట్ల పలువురు నాయకులు, ఉపాధ్యా యులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థికి మానవత సంస్థ చేయూత

పీలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు, ఒక కాలు పోగొట్టుకున్న పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ తువ్వకుంటపల్లెకు చెందిన బీటెక్ విద్యార్థి తెల్లావుల దేవేంద్రకు మానవత సంస్థ సభ్యులు రూ.5 వేల సాయం అందించారు. భవిష్యత్తులోనూ అతనికి తోడుగా నిలుస్తామని భరోసా కల్పించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు రామచంద్ర, అధ్యక్షుడు శెట్టిసుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కురబలకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ సేతు పేర్కొన్నారు.. గురువారం మండలంలోని విశ్వం డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

## ఆకతాయికి దేహశుద్ధి

ధర్మవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ ఆకతాయికి కాలనీవాసులు గురువారం దేహశుద్ధి చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన షేక్ బాబ్‌జాన్ పనిమీద ధర్మవరానికి వచ్చాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు బాలికలకు చాక్లెట్ ఆశ చూపి అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. ఆ బాలికలను పాఠశాలకు దూరంగా ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లబోయాడు. గమనించిన తోటి విద్యార్థులు సమీపంలోని స్థానికులకు విషయాన్ని చెప్పడంతో.. వారు షేక్ బాబ్‌జాన్‌ను చెట్టుకు కట్టేసి.. దేహశుద్ధి చేసి.. పోలీసులకు అప్పగించారు.

## క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తంబళ్లపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి మునికుమార్ పేర్కొన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా తంబళ్లపల్లెలో వైద్యులు, సిబ్బంది, ఐటీఐ విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇప్పుడు కాన్సర్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని..వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్క రూ క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు తేజశ్విని, రిచర్డ్, అమరసింహరాజు, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు సురేంద్ర, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

**పీలేరులో:** జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పీలేరు పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు. అంతకు మునుపు స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో తలపుల వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎటువంటి క్యాన్సర్‌కైనా చికిత్స ఉందని, వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకురాలు కుసుమ, రత్నం, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తలపుల పీహెచ్‌సీ సిబ్బంది

**కలకడలో:** క్యాన్సర్ వ్యాధి సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎర్రకోటపల్లె వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి తిరిగి క్యాన్సర్ లక్షణాలున్న వ్యక్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది భారతమ్మ, వెంకటేశ్వరరావు, అశ్విని, వాణి, శారద, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారుల తీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

గుర్రంకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మార్కెట్ యార్డులో వ్యాపారులు జాక్‌పాట్ విధానంతో రైతులను దోచుకుంటున్నారని గురువారం కొందరు రైతులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మార్కెట్ యార్డులో 10 టమోటా క్రేట్‌లకు రెండు చొప్పున జాక్‌పాట్ తీసుకుంటున్నారని, అలాగే అధిక కమీషన్‌ను వసూలు చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా రైతులు టమోటా పట్టి సొమ్ము ఇవ్వకుండా కొందరు వ్యాపారులు వేధిస్తునట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మార్కెట్ యార్డు కార్యదర్శి కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

## కబ్జా నుంచి శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

● తహసీల్దార్‌కు ఓబులంపల్లె దళితుల ఫిర్యాదు



ఓబులంపల్లెలో శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న దళితులు

వాల్మీకిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కబ్జా నుంచి శ్మశాన వాటిక స్థలం కాపాడాలని ఓబులంపల్లె గ్రామ దళితులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు ఈ విషయమై గురువారం తహసీల్దార్ పామిలేటికి వారు ఫిర్యాదు చేశారు. ఓబులంపల్లె గ్రామంలో దశాబ్ద కాలంగా దళితవాడకు సంబంధించిన సర్వే నెంబర్ 609లో శ్మశాన వాటిక స్థలాలను గ్రామానికి చెందిన అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో జరిపిన అక్రమ తవ్వకాల ద్వారా తమ పూర్వీకుల కబేలాలు కూడా బయటపడ్డాయని, ఏమిటని నిలదీస్తే ఈ భూములు తమకు పట్టా ఉన్నాయని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో దళితులంతా కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దార్ పామిలేటి మాట్లాడుతూ ఓబులంపల్లెలో శ్మశాన వాటిక స్థలాలు పరిశీలించి తప్పక న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓబులంపల్లె దళితవాడకు చెందిన మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఇబ్రహీం సతీమణికి ఆర్థిక సాయం అందజేస్తున్న బహుజన నాయకులు

పీలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఈ నెల 4వ తేదీన మరణించిన భవన నిర్మాణ కూలీ ఇబ్రహీం కుటుంబసభ్యులకు పీలేరులోని బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇబ్రహీం కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బందిరకంగా ఉందని తెలియడంతో అసోసియేషన్ సభ్యులందరూ రూ.30 వేలు పోగు చేసి ఇబ్రహీం సతీమణికి అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు బలరాం, ప్రభాకర్ రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలోని ప్రతి కార్మికుడూ కార్మిక శాఖ అందజేసే గుర్తింపు కార్డు తీసుకోవాలని తద్వారా కార్మికులకు జీవిత బీమా, ప్రమాదాల సమయంలో ఆర్థిక సాయం, ఆసుపత్రి వైద్యం వంటి సదుపాయాలు లభిస్తాయన్నారు. మరణించిన తమ సహచరుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన బహుజన అసోసియేషన్‌ను నేతలను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, వెంకటేశ్, షణ్ముగం, సయ్యద్ షావలీ, షామీర్, కరీముల్లా పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం సభను జయప్రదం చేయండి

మదనపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని విశ్వహిందూపరిషత్ పిలుపునిచ్చింది. స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయంలో గురువారం సంబంధిత కరపత్రాలను వీహెచ్‌పీ ఆవిష్కరించింది. వచ్చే ఏడాది జనవరి 5వతేదీన విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, వేణుగోపాల్‌నాయుడు, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ భానుప్రకాష్, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ దుర్గాప్రసాద్, మదనపల్లె కార్యవాహ విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్యవేదిక, సమరత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## టీహెచ్‌ఆర్ పంపిణీలో నిబంధనలు పాటించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్) పంపిణీలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిబంధనలు పాటించాలని సీడీపీవో సుజాత సూచించారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ పిల్లల హాజరు పెంచాలన్నారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సక్రమంగా అందించాలన్నారు. స్త్రీ సాధికారత నిర్వాహకులు అనంత్, జయశ్రీ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఎంపిక

మదనపల్లె అర్బన్, నవంబరు 7:మండలంలోని చిప్పిలి గ్రామంలోగల అయ్యప్ప స్వామి ఉత్సవ కమిటీని గురువారం నియమించినట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. ఇందులో ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా మార్పూరి సుధాకర్‌నాయుడు, శివమూర్తి, భాస్కర్ నాయుడు, రమణ్‌రావు, హేమంత్, బాలకృష్ణ, మల్లెనాయక్, జర్మనీరాజు, డంకణాచారి, సోమశేఖర్, రాజ్‌భవన్‌రాజు, మహేష్ తదితరు పేర్లను ప్రకటించారు. 20 మందితో కూడిన ఉత్సవ కమిటీని ఎంపిక చేశారు. ఈ కమిటీని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నాయకత్వంలో నియమించారు. రెండు నెలలు ఆలయాభివృద్ధితో పాటు, అన్నదాన కార్యక్రమం, స్వామివారు కైంకర్యాలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాభివృదికి అందరూ కృషి చేయాలని సూచించారు.

## కురబలకోట మాజీ సర్పంచ్ రాఘవరావు మృతి



కురబలకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట పంచాయతీ మాజీ సర్పంచ్ కె.రాఘవరావు అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయన 2006 నుంచి 2011 మధ్య పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. టీడీపీలో క్రియాశీలకంగా పని చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా పార్టీలకు అతీతంగా ఆయనకు పలువురు నివాళులర్పించారు.